ప్రభాత
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 26 నవంబర్ 2025

## రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంది

చిన్నమండెం నవంబర్ 25 ప్రభాతవార్త:



మంగళవారం మండలం లోని బోరెడ్డిగారిపల్లి గ్రామంలో మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు అధికారుల నుంచి వినతి పత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి తక్షణమే పలువురు అధికారులను ఆదేశించారు. పలు సమస్యలకు ప్రత్యక్షంగా పరిష్కారాన్ని అందించిన మంత్రి ప్రజల్లో విశేష విశ్వాసాన్ని నెలకొల్పారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ పరిష్కారమే ప్రధానంగా ప్రతి సమస్యకు తక్షణ స్పందన, పరిష్కారమే లక్ష్యం చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## రసవత్తరంగా బాస్కెట్‌బాల్ పోటీలు

మదనపల్లె, నవంబర్ 25 ప్రభాతవార్త :

మదనపల్లె మండలం సిటిఎంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా 69వ అండర్-14 బాల బాలికల పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో బాలికల క్వార్టర్ ఫైనల్స్‌లో నెల్లూరు, వెస్ట్‌గోదావరి జట్లు తలపడగా వెస్ట్ గోదావరి 22-0తో విజయం సాదించి సెమీ ఫైనల్స్‌కు చేరుకొంది. ఈస్ట్‌గోదావరి, విశాఖ పట్టణం జట్ల మద్య జరిగిన పోటీల్లో తూర్పు గోదావరి 28, 27స్కోర్‌లతో విజయం సాధించి సెమిఫైనల్స్‌కు చేరుకొంది. చిత్తూరు, కర్నూల్‌జట్టుల మద్య జరిగిన పోటీల్లో చిత్తూరుజట్టు విజయం సాదించింది. క్రిష్ణ, గుంటూరు జట్ట మద్య జరిగిన పోటీల్లో క్రిష్ణజట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ అబ్జర్వర్ వర్మ, ఉమ్మడి చిత్తూరుజిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్.బాబు, జిల్లా కార్యదర్శి నాగరాజు, హెచ్‌ఎం చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్, రియాజ్, భారతి, ఉపాద్యాయులు పాల్గొన్నారు.



హోరాహోరీగా ఆడుతున్న క్రీడాకారులు

# రాబోయే ఎన్నికల్లో విజయం సాధిద్దాం

రాయచోటి, నవంబర్ 25 ప్రభాతవార్త





నియోజకవర్గ పరిధిలోని మండలాల అద్యక్ష, క్లస్టర్, యూనిట్, గ్రామ బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముందుగా నియోజకవరంలోని 6 మండలాలకు చెందిన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరూ పార్టీ సైనికులేనని, గ్రామాలలో వర్గ విభేదాలు ఉన్నాయని ప్రతి టిడిపి కార్యకర్తకు న్యాయం చేస్తామన్నారు. ఇక్కడ చిన్న పెద్ద అనే తారతమ్యం లేదని అందరం పార్టీ కోసమే కష్టపడదామన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు అధినేత చంద్రబాబు న్యాయం చేస్తారని అందుకు నిదర్శనం తానే అన్నారు. పార్టీ కోసం కష్టపడిన ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరిగినా తాను సహించని, అలాంటి వాళ్ళు తనను నేరుగా సంప్రదించవచ్చున్నారు. వర్గ విభేదాలకు, మనస్పర్ధలకు పోకుండా అందరూ ఐకమత్యంతో పార్టీ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఒక ప్రక్క ప్రభుత్వాన్ని నడుపుతూనే మరోపక్క పార్టీ కార్యకర్తలకు న్యాయం చేయాలని మన అధినేత చంద్రబాబు విరామం లేకుండా శ్రమిస్తున్నారన్నారు. ప్రమాద బీమా కింద కార్యకర్తకు రూ 5 లక్షలు వస్తున్న ఘనత టిడిపికి దక్కుతుందని, అది చంద్రబాబు ఘనతే అన్నారు. ఆయన అడుగుజాడల్లో మనమందరం కూడా పార్టీ కోసం పనిచేసి రాబోవు స్థానిక ఎన్నికలలో నియోజకవర్గంలో విజయ దుందుబి మోగిద్దాం అన్నారు. భవిష్యత్తు తరం బాగుండాలంటే మరోసారి టిడిపి అధికారంలోకి వచ్చే విధంగా అందరం కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వంలో స్థానిక ఎన్నికలు అన్ని అరాచకాలతో జరిగాయని మనం న్యాయబద్ధంగా గెలుద్దాం అన్నారు. ఈ సందర్భంగా మంత్రి నూతన కమిటీకి, కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నియోజకవర్గంలోని ఆరు మండలాలలో ప్రతి ఇంటికి ఏడాదిలోపు త్రాగు, సాగు నీరు అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. గ్రామాలలో కులాయిలు బిగించేటప్పుడు, వాటర్ ట్యాంక్, పైపు లైను నిర్మాణ సమయంలో అధికారులను ప్రజలకు మమేకం చేస్తామని, ప్రజలే వారితో సంప్రదించి వేయించుకోవచ్చన్నారు. ఇదంతా కూటమి ప్రభుత్వ సహకారంతో జరుగుతున్నట్లు తెలిపారు. ఇటీవల పర్యటనలో సీఎం చంద్రబాబు వివరించడం జరిగిందన్నారు. మనం అభివృద్ధి చేస్తే ఎక్కడ మంచి పేరు వస్తుందోనని జగన్ రెడ్డి వైసీపీ క్యాడర్‌ను గ్రామాలకు పంపించి అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. తనకు టికెట్ ఇస్తే చాలు అనుకున్నానని, అలాంటిది టికెట్ ఇచ్చి గెలిచిన వెంటనే ఒకటి, రెండు కాకుండా ఏకంగా మూడు శాఖలకు మంత్రిని చేసిన ఘనత టిడిపి అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబుదే అన్నారు. తాను ఎన్నటికీ చంద్రబాబు అడుగుజాడల్లోనే నడుస్తానన్నారు. ఇదంతా నియోజకవర్గ ప్రజల సహకారంతోనే సాధ్యమైందన్నారు. వచ్చే ఎన్నికలలో టికెట్ ఇచ్చినా ఇవ్వకున్నా టిడిపి కోసమే పని చేస్తానన్నారు. టిడిపిని రాయచోటి కంచుకోటగా నిలబెట్టాలనేది తన అభిమతం అన్నారు. ప్రస్తుతం 18 నెలలు ప్రభుత్వం గడిచింది ఇంకా మూడు సంవత్సరాలు ఉంది, రాబోవు రోజుల్లో మంచి అభివృద్ధిని చూపించి పార్టీ కార్యకర్తలకు చేయూతనిచ్చి పార్టీని మరింత బలపరుచుకుందామన్నారు. సమస్యలు ఎన్ని ఉన్నా పార్టీ కోసం పని చేద్దాం అని పిలుపునిచ్చారు. ఒకేసారి అందరికీ న్యాయం చేయలేమని అర్థం చేసుకోవాలని, రాబోవు రోజుల్లో అందరికీ న్యాయం చేద్దామని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటే కష్ట కష్టపడిన వారికి దక్కుతాయన్నారు. స్వచ్ఛందంగా రాజకీయ పరిజ్ఞానం పెంపొందించుకొని ప్రతి కార్యకర్త ఎదగాలని, నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలియజేశారు.

### లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడమే

# జెండర్ క్యాంపైన్ ఉద్దేశ్యం



కడప, నవంబర్ 25, ప్రభాతవార్త :

ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై వివక్ష, హింస, అసమానతలను తొలగించి లింగ సమానత్వాన్ని ప్రో త్సహిస్తూ, మహిళల హక్కుల పరిరక్షణ, సామాజిక సవాళ్ళను అధిగమించడమే.. జెండర్ క్యాంపైన్ ప్రధాన ఉద్దేశ్యం అని డీఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 2025-26 జెండర్ కాంపెయిన్‌లో భాగంగా మంగళవారం ఉదయం జాతీయ స్థాయిలో కేంద్ర వ్యవసాయ మరియు పంచా యతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ జెండర్ కాంపెయిన్ కార్యక్రమాన్ని వర్చు వల్ విధానంలో ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ డి.బ్లాకులోని డీఆర్డీఏ సమా వేశ మందిరం నుండి డిఆర్డీఏ అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్డీఏ పీడి మాట్లాడుతూ.. జెండర్ కాంపెయిన్ లో భాగంగా.. లింగ వివక్ష నిర్మూలన, లింగ సమానత్వం, మహిళలకు సమాన హక్కులు సమాన అవకాశాలు, మహిళా నాయకత్వం దేశ ఆర్థిక అభ్యున్నతికి తోడ్పాటు అంశాలపై ముఖ్యంగా మహిళలు, బాలికలతో పాటు సమాజం మొత్తానికి అవగాహన కల్పించేందుకు 25.11.2025 నుండి 23.12.2025 వివిధ రకాలుగా క్యాంపైన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది నవంబర్ 25న "అన్ని మహిళలు మరియు బాలికలపై డిజిటల్ హింసను అంతం చేయడానికి ఐక్యం" అనే శక్తివంతమైన ప్రపంచ థీమ్ కింద ప్రపంచం మహిళలపై హింస నిర్మూలనకు అంతర్జాతీయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నందున, దేశం ఆఫ్‌లైన్ మరియు ఆన్‌లైన్ రెండింటిలోనూ లింగ ఆధారిత హింసను ఎదుర్కోవడానికి తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తోందన్నారు. మిషన్ శక్తి యొక్క వన్ స్టాప్ సెంటర్లు, మహిళా హెల్ప్ డెస్కులు మరియు అత్యవసర హెల్ప్‌లైన్‌ల విస్తరిస్తున్న నెట్‌వర్క్ ద్వారా, భారతీయ న్యాయ సంహిత చట్టాలు, సంస్కరణలు, వేగవంతమైన న్యాయాన్ని నిర్ధారిస్తోందన్నారు. ఈ సమగ్ర ప్రయత్నాలు ఆఫ్‌లైన్ మరియు ఆన్‌లైన్‌లో ప్రతి స్త్రీ మరియు బాలిక గౌరవం, స్వేచ్ఛ మరియు సమాన అవకాశాలతో జీవించగల సురక్షితమైన, మరింత సమగ్ర వాతావరణాన్ని నిర్మించడానికి దోహదపడుతాయన్నారు. అంతకుముందు జెండర్ క్యాంపెయిన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉదయం నగరంలోని విశ్వేశ్వరయ్య సర్కిల్ నుండి జిల్లాలోని స్వయం సహాయక సంఘ మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటరీ సంస్థలు మరియు అనుసంధాన శాఖల ఉద్యోగులు కలిపి సుమారు 200 మందితో మహావీర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ మానవ హారంగా ఏర్పడి అందరితో జెండర్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. అనంతరం ర్యాలీ కలెక్టర్ వారి కార్యాలయం వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెప్మా పీడి కిరణ్ కుమార్, ఐసిడిఎస్ పీడి రమాదేవి, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డిఎంహెచ్ఓ డా. నాగరాజు, డిఆర్డీఏ ఎపిడి ప్రసాద్, పోలీసు, మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ మొబైల్ సీల్డ్ 'భారీగా సెల్‌ఫోన్ల రికవరీ'





కడప క్రైం, నవంబరు 25, ప్రభాతవార్త:

ఆపరేషన్ మొబైల్ షీల్డ్ కింద కడప జిల్లా సైబర్ క్రైం పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నెట్‌వర్క్ నిఘా మరియు డేటా విశ్లేషనా పద్ధతులు ఉపయోగించి భారీ మొబైల్ ఫోన్ రికవరీ ఆపరేషన్‌లో సఫలమయ్యారు. మంగళవారం 7వ విడతలో భాగంగా రూ.1.86 కోట్ల విలువైన 720 మొబైల్ ఫోన్లు బాధితులకు తిరిగి అప్పగించడం జరిగిందని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు ఎంఎంటీఎస్ ద్వారా లలేదా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడం వల్ల ఐఎంఈఐ ఆధారిత ట్రాకింగ్ మరియు డేటా అనలిటిక్స్ పద్ధతుల ద్వారా ఫోన్లు త్వరితగతిన రికవరీ చేశామన్నారు. మొబైల్ రికవరీ విషయంలో రాష్ట్ర స్థాయిలో కడప జిల్లా మంచి ప్రగతి సాధించినట్లు తెలిపారు. మొబైల్ పోయినప్పుడు, చోరీకి గురైనప్పుడు చేయాల్సిన తక్షణ కర్తవ్యం బ్యాంకు ఖాతాలను తక్షణమే బ్లాక్ చేయించాలి, సిమ్‌కార్డు నెంబరును ఆలస్యం చేయకుండా డిసేబుల్ చేయించుకోవవాఇలి. గూగుల్/ఫోన్‌పే వంటి ఆర్థిక యాప్‌లకు అప్లికేషన్లను 2 ఫ్యాక్టర్ అథెంటికేషన్ లేదా బయోమెట్రిక్ సెక్యూరిటీ వినియోగించాలి. మొబైల్ పోయిన తక్షణమే గూగుల్ ఐడీ బ్యాంకింగ్ యాప్స్, వాట్సాప్, మెయిల్, సోషల్ మీడియా వంటి వాటి పాస్‌వర్డ్ మార్చుకోవాలి. మీ ఫోన్ చోరీకి గురైన వెంటనే 9392941541కు కాల్ చేసి వివరాలు తెలపాలన్నారు. సైబర్ క్రైం మోసాలకు గురైన వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి తెలపాలన్నారు.

### సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనేటప్పుడు జాగ్రత్తలు

ఫోన్ బిల్లు, సెల్‌ఫోన్ బాక్స్ మరియు ఫోన్ అమ్మే వ్యక్తి గురించి సరిగా పరిశీలించాలి. అపరచితుల నుంచి ఫోన్లు కొనుగోలు చేయడం ద్వారా సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉంది. కడప సైబర్ క్రైం టీం ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్ల రికవరీకి సంబంధించిన డిజిటల్ ఫోరెన్సిక్స్ ఆధారిత సాంకేతికతను ఉపయోగించడంతో జిల్లా ఎస్పీ సైబర్ క్రైం బృందాన్ని అభినందిస్తూ ఈ రికవరీ ఆపరేషన్‌లో ముఖ్యంగా పనిచేసిన ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వరరెడ్డి, సిబ్బంది, ఖాదర్‌బాషా, అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాసులును ప్రశంశా పత్రాలు అందజేశారు.

### కిడ్నీ రాకెట్ కేసులో

# మరో ఇద్దరు అరెస్ట్

మదనపల్లెక్రైమ్, నవంబర్ 25 ప్రభాతవార్త.

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన కిడ్నీ రాకెట్ కేసులో మరో ఇద్దరిని మదనపల్లె పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల అరెస్టుకు సంబంధించి డిఎస్పి మహేంద్ర, సీఐ రాజారెడ్డి లు మాట్లాడుతూ మదనపల్లె గ్లోబల్ ఆసుపత్రి కేంద్రంగా కిడ్నీ రాకెట్ వ్యవహారం బట్టబయలు కావడం తెలిసిందే. ఈ కేసులో విశాఖకు చెందిన యమున కిడ్నీని తీసి మరొకరికి అమర్చిన సంఘటన లో అపరేషన్ వికటించి యమున మృతి చెందటంతో కిడ్నీ రాకెట్ దందా వెలుగు చూసింది. ఈ కేసులో ఇప్పటికే అన్నమయ్య జిల్లా డిసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు సహా మరో ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ కేసులో కీలకన్నింది తట్టిన బెంగళూరు డాక్టర్ పరారీలో ఉన్నాడు. బెంగళూరు డాక్టర్‌కు సహకరించిన కడప ప్రకాష్‌నగర్‌కు చెందిన ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు సుమన్, కొండయ్యలు నిందితులుగా ఉండడంతో వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తును మరింత లోతుగా చేస్తున్నట్లు డీఎస్పీ మహేంద్ర పేర్కొన్నారు.



# బడా నాయకుల భూకబ్జాల భరతం పట్టండి

### టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజు

నందలూరు, నవంబర్25 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా గత వైకాపా ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని వందలాది ఎకరాల భూములను భూకబ్జాచేసిన బడా నాయకుల భరతం పట్టి భూ ఆక్రమణలు తొలగించాలని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు కోరారు. కబ్జాకు గురైన భూములను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై అధికారులు వేగంగా స్పందించాలని ఆదేశించారు. మంగళవారం తాసిల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, నిరక్ష్యంల్ల వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా దర్బార్ లో వచ్చిన సమస్యలను ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారుడుకి న్యాయం చేయాలని కోరుతూ, సర్టిఫికెట్లను కూడా ఎప్పటికప్పుడు ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జంగంశెట్టి సుబ్బయ్య, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, ఒంటిమిట్ట జడ్పిటిసి మధు కృష్ణారెడ్డి, సర్పంచ్ రాము, పాటూరు గ్రామ అధ్యక్షులు రమేష్, సుబ్బ నరసయ్య, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



తాసిల్దార్ తో సమావేశమైన జగన్మోహన్ రాజు

# అధైర్య పడకండి నేనున్నాను

### అన్యాయం జరిగితే న్యాయ పోరాటం చేద్దాం

### ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటా

### ప్రజా దర్బార్‌లో వైఎస్ జగన్



పులివెందుల నవంబర్ 25 ప్రభాతవార్త :

అధైర్య పడకండి మీకు తోడుగా నేనున్నా, సమస్యలు ఉంటే నేరుగా నాతో చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో గెలిచేది మనమేనని, న్యాయం కోసం పోరాటం చేస్తామని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా దర్బారులో వైసీపీ శ్రేణులకు తెలిపారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం పులివెందులకు చేరుకున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి హెలిప్యాడ్ దగ్గర కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి, శాసనమండలి సభ్యులు రామ సుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఘన స్వాగతం పలికారు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఆయనని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకు పోరాటం చేసే దానికి సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు. ఇకపై ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని నాయకులకు స్పష్టత ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### చిరునవ్వుతో సమస్యలు వింటూ భరోసా ఇస్తూ

ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రజల, వైసీపీ శ్రేణుల సమస్యలను ఓపిగ్గా వింటూ, చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ తోడుగా నేనుంటానని వారికి భరోసా ఇచ్చారు. ప్రజలు ఈ సందర్భంగా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తానని, మనకు అన్యాయం జరిగితే న్యాయపరంగా ముందుకు వెళ్దామని, ఎవరు అధైర్య పడకుండా ముందుకు వెళ్లాలన్నారు. .

### జగన్ కలిసేందుకు పోటెత్తిన జనం

వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసేందుకు రాయలసీమ జిల్లాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. వైయస్ జగన్ క్యాంపు కార్యాలయానికి రాగానే వైసిపి నాయకులు, కార్యకర్తలు సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. ఆయన కలిసేందుకు భారీగా జనం తరలివచ్చారు. జగన్ కార్యాలయం తోపాటు ప్రాంగణం అంతా జనాలతో నిండిపోయింది. జనం రావడంతో వారిని అదుపు చేయలేక పోలీసులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రెండో రోజు బుధవారం పలు కార్యక్రమంలో పాల్గొననున్నారు. వైసిపి నాయకుడు కొంగనపల్లి మురళీమోహన్ కుమారుని వివాహ వేడుకల్లో పాల్గొని, అనంతరం బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ మల్‌రెడ్డి అరటి తోటను పరిశీలించరున్నారు. తర్వాత ఇటీవల కాలంలో మృతి చదిన లింగాల మాజీ సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తారు. ఆ తర్వాత వేముల మండలం వైసీపీ నాయకుడు రామలింగారెడ్డినీ పరామర్శిస్తారు. తర్వాత పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తారు.

# మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి

### - 96వేల మందికి పైగా అవగాహన మరియు 25వేల శక్తి యాప్ రిజిస్ట్రేషన్లు : జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, నవంబరు 25, ప్రభాతవార్త:

మహిళల భద్రత మరియు రక్షణే ధ్యేయంగా జిల్లా పోలీసు శాఖ పని చేస్తోందని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం జిల్లాలో మహిళలకు, ప్రజలకు అత్యవసర హెల్ప్‌లైన్ నెంబర్లతో కూడిన పోస్టర్లను స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 'శక్తి' యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2110 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వీటిలో 96852 మంది పాల్గొన్నారన్నారు. ఆత్మరక్షణకు మనోధైర్యాన్ని నింపడానికి 157 సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమాలు నిర్వహించాని దీని ద్వారా 13306 మంది విద్యార్థినిలు లబ్ధి పొందారని తెలిపారు. 2025లో ఇప్పటి వరకు 686 జనరల్ పిటిషన్లు రాగా కౌన్సెలింగ్ ద్వారా 518 కేసులు రాజీ కుదిర్చామన్నారు. ప్రతి మహిళ తన ఫోన్‌లో ఎస్ఓఎస్ యాప్‌ను కలిగి ఉండడం అత్యవసరమన్నారు. 2025లో కంట్రోల్ రూం ద్వారా 6623 అలర్ట్స్/కాల్స్ పర్యవేక్షించడం జరిగిందని 166 అత్యవసర కాల్స్‌కు తక్షణ సహాయం అందించామన్నారు. ఏదైనా అపాయం లేదా అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నప్పుడు శక్తి యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చన్నారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112కు కాల్ చేసిన కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100/112, చైల్డ్‌లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర, ప్రతి మహిళా, బాలిక తమ భద్రత కోసం ప్రభుత్వం కల్పించిన చట్టాలను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వివరించి వారిని చైతన్యవంతులను చేశామన్నారు.





# ఆధునిక వ్యవసాయంతో రైతు అభివృద్ధి చెందాలి

రాజుపాళెం, నవంబర్ 25, ప్రభాతవార్త:

ప్రతి రైతు ఆధునిక వ్యవసాయం ద్వారా స్వయంగా అభివృద్ధి చెందాలి, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం, వాణిజ్య పంటల ద్వారా అధిక దిగుబడులను సాధించి లాభసాటి వ్యవసాయం చేయాలని, ప్రభుత్వం ఉచితాలు అందిస్తుందని వాటి కోసమే ఎదురు చూడరాదని అవి కేవలం వ్యవసాయం కుంటు పడకుండా రైతు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు మాత్రమే సహాయపడతాయని జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారి శివరామ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతన్న మీకోసం నిర్వహిస్తున్న కార్యక్రమంలో నియోజకవర్గం ప్రత్యేక అధికారి సీఈవో ఓబులమ్మ పాల్గొని రైతుల సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల వల్ల ఉపయోగం గురించి అడిగి తెలుసుకున్నారు. సబ్సిడీ విత్తనాలు పంపిణీ అదును దాటిన తర్వాత అందచేయడం ఎందుకని, ఖరీఫ్ సీజర్ లో పంటలు సాగు చేసుకునేటప్పటికే బీమా చెల్లింపు గడువు ముగిస్తే సాగు చేసిన పంటలకు బీమా చెల్లింపు ఎలాగని రైతులు కొందరు ప్రశ్నించారు. గ్రామ ప్రజలు త్రాగునీటి సమస్య, పారిశుధ్య సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అక్కడే ఉన్న గ్రామ సచివాలయ అధికారులను ఎందుకిలా జరుగుతుందని ప్రశ్నించి పరిష్కారమునకు వెంటనే చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్ డిఓ రామాంజనేయులు, ఎంపీడీవో రామనాథరెడ్డి, ఈవోపీఆర్డి శాకీర్ అలీ ఖాన్, పశువైద్యాధికారి లక్ష్మీదేవి, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వీఆర్వో అశోక్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రామాంజనమ్మ, వ్యవసాయ శాఖ గ్రామ సహాయకురాలు బేబీ, తదితరులు పాల్గొన్నారు.



## తవళం శివాలయం భూములు వేలం పాటలు

నిమ్మనపల్లి నవంబర్ 24 ప్రభాతవార్త

నిమ్మనపల్లి మండలం తవలం శివాలయం భూములు ఈనెల 27న వేలం వేయనున్నట్లు ఈవో మంజుల సోమవారం తెలిపారు. ఈ భూములు ఏడాది పాటు లీజుకి ఇవ్వనున్నట్లు ఈవో తెలిపారు. ఆసక్తిగల రైతులు ఈనెల 27న జరిగే వేలంపాటలో పాల్గొని ధరావత్తును చెల్లించి వేలం పాటను దక్కించుకోవాలని ఇవ్వ తెలిపారు.

## గొంటువారిపల్లెలో భూ ఆక్రమణలు

కాశినాయన, నవంబర్ 25, ప్రభాతవార్త

గొంటువారిపల్లె గ్రామములో భూ ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలను కూడా లెక్కజేయకుండా ఆక్రమణ భూమిలో పంటలు సాగుచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే గ్రామములో ఇటీవల సర్వే నెంబర్ 171/1,174/1 లో వాగు పోరంబోకు భూమిని ఆక్రమించుకొని చుట్టూ ముళ్ళకంచే వేసుకుని పట్టభూములకు దారి ఇవ్వకుండా దౌర్జన్యం చేశారు. ఈ విషయం బాధితులు జిల్లా కలెక్టర్ శ్రీధర్ దృష్టికి ఈసుకెళ్లారు. కలెక్టర్ స్పందిస్తూ ముళ్ల కంచెను తొలగించి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని బద్వేల్ ఆర్డీవో కాశినాయన తహసీల్దార్‌కు ఆదేశాలు జారీచేశారు. వారు స్పందిస్తూ ఆక్రమణ భూమికి హద్దులు నిర్ణయించి ఆ భూమిని స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డును భాతారు. హెచ్చరిక బోర్డును బాతినప్పటికి ఆక్రమణదారులు ఖాతరు చేయకుండా ఆక్రమణ భూమిలో యధావిధిగా పంటలు సాగుచేస్తున్నారు. అధికారులు స్పందించి ఆక్రమనదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకొని,చుట్టూ వున్న ముళ్ళకంచెను తొలగించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాల కోరారు.

## 27న ఎంపి సమీక్షా సమావేశం

మదనపల్లె, నవంబర్ 25 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఈనెల 27న గురువారం మదనపల్లె ఎంపిడిఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించన్నుట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. మంగళవారం వైకాపా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపి మిథున్‌రెడ్డి ప్రజాసమస్యలపై సమీక్ష ఉంటుందన్నారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్ ఛైర్మెన్ జింకా వెంకటాచలపతి, ఎంపిపి వెలుగు చంద్రా రెడ్డమ్మ, మండల అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, రామసముద్రం మండల కన్వీనర్ కేశరెడ్డి, నాయకులు హర్షవర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## రహదారుల దుస్థితిపై మంత్రికి ఫిర్యాదు

మదనపల్లె, నవంబర్ 25 ప్రభాతవార్త :



ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

మదనపల్లె రోడ్ల దుస్థితిపై ఏపి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులురెడ్డిలకు బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఫిర్యాదు చేశారు. మదనపల్లె-నిమ్మనపల్లె, మదనపల్లె-రామసముద్రం, మదనపల్లె-బెంగుళూరు రహదారుల పూర్తిగా ద్వంశమై ప్రయాణానికి అత్యంత దారుణంగా మారాయన్నారు. దీనిపై అధికారులకు అనేక పర్యాయలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని విన్నవించారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో బివైఎస్ కార్యకర్తలు మానవతా దృక్పదంతో సొంత ఖర్చులతో సిమెంటు వేసి, రాళ్ళు, కాంక్రిట్ ఉపయోగించి రోడ్డుకు తాత్కాళిక మరమ్మత్తులు చేశారు. రహదారులు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## డిమాండ్ ఆధారిత పంటలను సాగు చేయాలి

### జిఎస్‌డబ్ల్యు కోఆర్డినేటర్ లక్ష్మీపతి



కురబలకోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కురబలకోట, నవంబర్ 25 ప్రభాతవార్త :

డిమాండ్ ఆధారిత పంటలను రైతులు సాగుచేస్తే ఆర్థికాభివృద్ధి చెందవచ్చునని జిఎస్‌డబ్ల్యు కోఆర్డినేటర్ లక్ష్మీపతి తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కురబరకోటలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రైతులను రాజులుగా చేసేందుకు 5విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ అమలు చేసిందని తెలిపారు. ఇందులో మారుతున్న కాలాన్ని బట్టి పంటలు కూడా సాగు చేయాలని ఆయన రైతులకు సూచించారు. రాగులు, జొన్నలు, కొర్రలు, చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉందని వాటిని సాగుచేసేందుకు రైతుల అలోచనా విధానంలో మార్పు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఇప్పటి వరకు 1547 రైతు కుటుంబాలను సందర్శించి అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేసినట్లు ఏఓ వినుత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గంగయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## హైవేపైకి చెరువునీరు - ఆదమరిస్తే ప్రమాదం

కురబలకోట, నవంబర్ 25 ప్రభాతవార్త :



హైవే పైకి చెరువునీరు

అంగళ్ళుకు సమీపంలోని కనసానివారిపల్లె చెరువునీరు హైవేపైకి చేరుతోంది. దీంతో వాహనదారులకు, వాహనాలకు రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఇటీవల కురిసిన వర్షానికి మొలకవారిపల్లె చెరువు నిండి మొరవ పారుతోంది. ఈ నీరు కనసానివారిపల్లె చెరువుకు చేరి నిండింది. నీరు హైవేరోడ్డులోకి చేరడంతో అధికారులు డ్రమ్ములను ఏర్పాటు చేసి అప్రమత్తం చేశారు. రాత్రి సమయాల్లో కడప,రాయచోటి, పొద్దుటూరు, రాజంపేట తదితర ప్రాంతాల నుంచి ఈ మార్గం గుండా మదనపల్లె, బెంగుళూరులకు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఏ మాత్రం అజాగ్రత్త వహిస్తే చెరువులోకి దూకడం ఖాయం. అంతేకాకుండా బైపాస్ మార్గం గుండా ఎలాంటి వీధిదీపాలు కూడా లేవు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## పేకాట స్థావరంపై దాడి - ఇద్దరు అరెస్టు

నిమ్మనపల్లె, నవంబర్ 25 ప్రభాతవార్త :



నిమ్మనపల్లె మండలంలో పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. మండలంలోని బండ్లపై గ్రామ సమీపంలోని రిజర్వు ఫారెస్టులో జూదస్థావరంపై పోలీసులు దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకొన్నారు. వీరినుంచి రూ.17150లు, ఐదు మోటార్‌సైకిళ్ళు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నేడు శ్రీవల్లిదేవసేన సమేత

# సుబ్రమణ్యస్వామి వార్షికోత్సవం

మదనపల్లె, నవంబర్ 25 ప్రభాతవార్త :



సుబ్రమణ్యస్వామి దేవస్థానం

మదనపల్లె-నిమ్మనపల్లె రోడ్డులోని వశిష్టస్కూల్‌కు ఎదురుగా ఉన్న శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు రాచపల్లి అనూరాధ సుబ్రమణ్యంలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వశిష్ట స్కూల్ ఎదురుగా ఆర్‌ఎస్‌నగర్‌లో వెలసియున్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవస్థానంలో పంచమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మద్యాహ్నం 12గంటలకు కళ్యాణ మహోత్స కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐదేళ్ళ క్రిత నిర్మించిన ఆలయం ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ది చెంది ఈ ప్రాంత భక్తులకు సుబ్రమణ్య స్వామి దర్శనభాగ్యం కల్పిస్తున్నారన్నారు. సుబ్రమణ్య స్వామి దర్శనార్థ గతంలో తిరుత్తని, పలని వంటి ఆలయాలకు వెళ్లాల్సి వచ్చేందని ఇలాంటి ఇబ్బంది లేకుండా మదనపల్లె పరసర ప్రాంతంలో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని నిర్మించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నామన్నారు. కావున నేడు నిర్వహించే కళ్యాణోత్సవంలో పాల్గొని భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఘనంగా కలిశ, స్థాపన పూజలు అర్చకులు రంగయ్య శాస్త్రి



సిద్ధవట నవంబర్,25 ప్రభాతవార్త

నూతన విగ్రహాలు ప్రతిష్ట సందర్భంగా మండల కేంద్రమైన సిద్ధవటం లో పెన్నా నది ఒడ్డున వెలసిన శ్రీ బాల బ్రహ్మేశ్వర ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రంగయ్య శాస్త్రి మంగళవారం మాట్లాడుతూ నూతన, గణపతి, సుబ్రమణ్యం స్వామి, అయ్యప్ప స్వాముల విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు బుధవారం ఉదయం ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా మంగళవారం ,, మహాన్నవనము, శాంతి పౌష్టిక హోమము, ధాన్యాదివానము, పుష్పాధి హోమం, చతుర్వేదస్య మంగళహారతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు ఈ కార్యక్రమంలో రంగయ్య శాస్త్రి శిష్యబంధం, గురుస్వామి సుబ్బరాయుడు, ఆవుల నాగేంద్ర, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

## సిపిఆర్‌తో గుండెపోటు వ్యక్తులను కాపాడండి

బి. కొత్తకోట. నవంబర్ 25 ప్రభాతవార్త



గుండెపోటు సోకిన వ్యక్తులకు ప్రాథమిక చికిత్స ద్వారా ప్రాణాలను కాపాడాలని డాక్టర్ రమేష్ నాథ్ సూచించారు. మంగళవారం బి.కొత్తకోట సుంకు ఉషా గౌతమి జూనియర్ కళాశాలలో హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో లింగుట్ల రిచ్ గ్లోబల్ ఫౌండేషన్ సహకారంతో సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. అవగాహన కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు రత్న శేఖర్ విద్యార్థులకు సిపిఆర్ పై ప్రథమ చికిత్స మనిషి రూపంలో ఉన్న బొమ్మ పై సిపిఆర్ ప్రయోగం చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ ఎంతోమంది సిపిఆర్ పై అవగాహన లేక ప్రాణాలు కోల్పోతున్నారని ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో తృణప్రాయంగా గుండెపోటుతో ప్రాణాలు కోల్పోతున్నారని సిపిఆర్ పై అవగాహన పెంచి మానవతా దృక్పథంతో సిపిఆర్ తో ప్రాథమిక వైద్యం చేసి ప్రాణాలు కాపాడుదామని దీనిపై విస్తృతంగా ప్రచారం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుంకు ఉషా గౌతమి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్, అధ్యాపకులు ఆదిశేషు, సాదిక్, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు ఫయాజ్, నక్క మహేష్, సునీల్, అబ్దుల్లా, నవీన్, కాలేజీ అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జాగ్ పాట్ విధానం రద్దు పట్ల...హర్షం

### మండల జనసేన పార్టీ నాయకులు

రామసముద్రం,నవంబర్ 25 ప్రభాతవార్త



మదనపల్లి టమోటా మార్కెట్లో బుధవారం నుండి కమిటీ సభ్యుల,మండి యజమానుల నిర్ణయం మేరకు,జాక్ పాట్ విధానాన్ని రద్దు చేయడం జరిగిందని ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం తెలియజేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని అన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం పట్ల రామసముద్రం మండల జనసేన పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రైతులు కృతజ్ఞతలు తెలిపారు.వారిలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు హోసూర్ చంద్రశేఖర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా సంయుక్త కార్యదర్శి టిఎం సనావుల్లా, ఉపాధ్యక్షులు గడ్డం లక్ష్మీపతి, సీనియర్ నాయకులు బాబు, కార్యదర్శ క్రాంతి, సహాయ కార్యదర్శి గౌతమ్ లు వర్షం వ్యక్తం చేయడం జరిగింది.

## రావులపల్లి సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

ఖాజీపేట, నవంబర్ 25, ప్రభాతవార్త:



రాజకీయ ఒత్తిళ్లతో గతంలో రద్దు చేసిన చెక్ పవర్ ను అధికారులు తిరిగి పునరుద్ధరణ గావించారు. వివరాల్లోకి వెళితే...ఖాజీపేట మండలం రావులపల్లి పంచాయితీ సర్పంచ్ గా పైడేల శివరామిరెడ్డి వైకాపా మద్దతుదారునిగా విజయం సాధించారు. ప్రత్యర్థులు నిధుల దుర్వినియోగం ఆరోపణలు చేసి 2023-2024 ఆర్థిక సంవత్సరంలో ఒక లక్షా 70 వేల రూపాయలు 15వ ఆర్థిక సంఘం నిధులు 46 వేల రూపాయలు దుర్వినియోగం అయినట్లు అధికారులకు లిఖిత పూర్వకంగా పిర్యాదు చేసి వారిపైన ఒత్తిళ్లు తీసుకొని వచ్చి 2025 ఫిబ్రవరి 24న సర్పంచ్ శివరామిరెడ్డి చెక్ పవర్ ను రద్దు చేయించారు. దీంతో తాను ఎలాంటి నిధుల దుర్వినియోగం చేయలేదని నిజానిజాలు తేల్చాలని సర్పంచ్ శివరామిరెడ్డి ఆధారాలతో కోర్టు గడప తొక్కారు. కోర్టు దీనిపైన సమగ్ర విచారణ నిర్వహించాలని కలెక్టర్ కు ఆదేశించింది. పునర్విచారణ చేసిన కలెక్టర్ సర్పంచ్ శివరామిరెడ్డి ఎలాంటి నిధుల దుర్వినియోగం చేయలేదని తన విచారణలో తేల్చి చెక్ పవర్ ని పునరుద్ధరించారు.

## పోలి లో రైతన్న మీకోసం

రాజంపేట, నవంబర్25 ప్రభాతవార్త



రైతుకు శాశ్వతమైన ఆర్థిక మార్పు లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన రైతన్న మీకోసంలో భాగంగా మంగళవారం రాజంపేట మండలం పోలి పంచాయతీలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, వైస్ చైర్మన్ కర్ణాటకం చంగళ్రాయుడు గ్రామ రైతులు, సచివాలయ అధికారులతో కలిసి అన్నదాత సుఖీభవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో పోలి చెరువు నీటి సంఘము వైస్ చైర్మన్, టీడీపీ గ్రామ కమిటి అధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, యూనిట్ ఇంచార్జి వెంకటరమణ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి కొనసాగుతున్న వాదనలు

ప్రొద్దుటూరు క్రైం, నవంబరు 25, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో నమోదైన తనకంటి జ్యువెలర్స్ యజమాని తనకంటి శ్రీనివాసులు, అతని తమ్ముడు తనకంటి వెంకట స్వామిని ప్రొద్దుటూరు కోర్టుకు త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో హాజరు పరచడం జరిగింది. అయితే తనకంటి వెంకట స్వామి నడవలేని స్థితిలో కోర్టుకు హాజరవడంపై న్యాయమూర్తి ఆరా తీశారు. పోలీసులు తీవ్రంగా కొట్టారని న్యాయమూర్తి ఎదుట వెంకట స్వామి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు ఎలాంటి గాయాలు లేవని రిపోర్టు ఇవ్వడంతో వెంకటస్వామిని ప్రైవేటు ఆసుపత్రికి పరీక్షల నిమిత్తం అడ్వకేట్ కమిటీలో న్యాయమూర్తి పంపించారు. తిరిగి ప్రొద్దుటూరు కోర్టులో హాజరుపరిచిన పోలీసులు, న్యాయవాదుల కమిటీతో కోర్టులో అర్ధరాత్రి వరకు వాదనలు జరిగాయి. వారికి రూ.20వేల సొంత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేయడం జరిగింది. పోలీసుల వ్యవహార శైలిపై న్యాయమూర్తి ప్రశ్నించారు. తనకంటి జ్యువెలర్స్ యజమాని శ్రీనివాసులు, వెంకటస్వామిలకు ఏ చిన్న అపాయం జరిగినా పోలీసులదే బాధ్యత అని తెలిపారు.

## పక్షపాతం ఆరోపణలతో సీఐపై శాసన చర్య

ప్రొద్దుటూరు క్రైం, నవంబరు 25, ప్రభాతవార్త:



సివిల్ వివాదంలో అనధికార జోక్యం చేసుకొని పక్షపాతంగా వ్యవహరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ప్రొద్దుటూరు సీఐ తిమ్మారెడ్డిపై చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆయనను వెంటనే వీఆర్‌కు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ విశ్వనాథ్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఇద్దరు బంగారు వ్యాపారుల మధ్య ఆస్తి/వ్యాపార సంబంధిత వివాదం నెలకొనగా సీఐ తిమ్మారెడ్డి ఆ విషయాల్లో నేరుగా జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంకా శ్రీనివాసులు అనే బంగారు వ్యాపారిని కిడ్నాప్ చేయించి చిత్రహింసలకు గురి చేశారన్న తీవ్రమైన అభియోగాలు కూడా ఆయనపై వచ్చాయి. ఈ వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కూడా తీవ్రంగా స్పందించారు. ఆరోపణలు మరియు రాజకీయ ఒత్తిడి నేపథ్యంలో సీఐపై శాఖా చర్యలు తప్పవని ఎస్పీ భావించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సంబంధిత ఫిర్యాదులు, కాల్ డేటా, సీసీ పుటేజీ మరియు ఇతర వివరాలపై ఉన్నతస్థాయి విచారణ కొనసాగుతోంది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఎంపీ సీఎం రమేష్ తల్లికి పరామర్శ



ప్రొద్దుటూరు నవంబర్ 25 ప్రభాతవార్త

గత వారం రోజుల నుండి అనారోగ్యంతో హైదరాబాద్ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతూ హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో కడపకు చేరుకొని వారి స్వగ్రామం ఎర్రగుంట్ల మండలం పొట్లదుర్తి చేరుకున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ నాయుడు తల్లి మునుస్వామి రత్నమ్మను అనకాపల్లి జిల్లా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే బండారు సత్య నారాయణ మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి మరియు పలువురు రాజకీయ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా చింతకుంట మునిస్వామి నాయుడు సతీమణి రత్నమ్మ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపారు.

## పెద్దేరు ఆయకట్టు రైతులు తరలిరండి.

తంబళ్లపల్లె నవంబర్ 25 ప్రభాతవార్త ః

మండలంలోని పెద్దేరు ప్రాజెక్టు ఆయకట్టు రైతులు ఈనెల 27వ తేదీ ప్రాజెక్టు వద్దకు సాగునీటి చర్చా వేదికకు తరలిరావాలని పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ కొటాల శివకుమార్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెద్దేరు ప్రాజెక్ట్ నిండి మొరవ పోతోందని ఆయకట్టులోని సుమారు నాలుగు వేల ఎకరాలు సాగు పై ఆయకట్టు రైతులతో రబీ సాగుపై చర్చా వేదిక జరుగుతుందని ఈ సమీక్షకు ఇరిగేషన్ ఈ.ఈ,డి.ఈ,ఎం.ఈ, ఆయ కట్టు కమిటీ సభ్యులు హాజరవుతారని ప్రాజెక్టు ఆయకట్టులో ప్రతి రైతు పంట సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రైతులు హాజరై సహకరించాలన్నారు.

## సమైక్యనగర్‌లో పచ్చదనం పరిశుభ్రత





పెండ్లిమర్రి, నవంబరు 25, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ స్పెషల్ ప్రోగ్రాంలో భాగంగా 2వ రోజు మంగళవారం సమైక్య నగర్‌లో ఉన్న రామాలయం చుట్టుపక్కల ఆవరణమంతా పిచ్చిమొక్కలు తొలగించి వీధులను శుభ్రం చేయడం జరిగింది. అలాగే దేవాలయ ప్రాంగణంలో అనేక దేవతా వృక్షాలు నాటడం జరిగింది. అందులో భాగంగా బిల్వం వృక్షం, పారిజాతం, జమ్మిచెట్టు, ఉసిరి చెట్టు, కదంబ వృక్షం, గన్నేరు మొక్కలు, మందార మొక్కలు, అనేకం నాటి ప్రాంగణాన్ని సుందరీకరించారు. ఈ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని న్ఎస్ఎస్ ప్రార్థనా గీతంలో ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, గ్రామ సర్పంచ్, స్థానికులు, విద్యార్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎస్.బి.ఐ ఫౌండేషన్ ద్వారా వైద్య సేవలు



దువ్వూరు, నవంబర్ 25, ప్రభాతవార్త:

మండల పరిధిలోని చిన్న సింగనపల్లె గ్రామంలో మంగళవారం ఎస్.బి.ఐ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభంజన్ మాట్లాడుతూ సేవా రంగంలో భాగంగా ఎస్.బి.ఐ ఫౌండేషన్ ఈ కార్యక్రమం చేపట్టిందని ఇప్పటికి 20 గ్రామాల్లో వైద్య సేవలు అందజేసినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు చైతన్యవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మహేశ్వరి, గౌస్, దీప్తి, భాష పాల్గొన్నారు.

## మండల క్లస్టర్ ఇంచార్జిగా దుద్యాల విష్ణువర్ధన్ రెడ్డి

సంబేపల్లి నవంబర్ 25 ప్రభాతవార్త



సంబేపల్లి మండల క్లస్టర్ ఇంచార్జిగా దుద్యాల గ్రామం వడ్డీ వాండ్ల పల్లెకు చెందిన విష్ణువర్ధన్ రెడ్డిని ఎంపిక చేశారు.వడ్డీ వాండ్ల పల్లెకు చెందిన మంగళవారం రాయచోటిలోని మదనపల్లి రోడ్ లోనే ఎంఎన్ఆర్ కళ్యాణమండపం లో నియోజకవర్గపు జరిగిన మండల క్లస్టర్ యూనిట్ గ్రామ బూత్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలో సంబేపల్లి మండల క్లస్టర్ ఇంచార్జిగా దుద్యాల విష్ణువర్ధన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ క్లస్టర్ ఇంచార్జిగా ఎంపిక చేసిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి, మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డికి మోర్యా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు

## మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



దువ్వూరు, నవంబర్ 25, ప్రభాతవార్త:

మండల పరిధిలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అవస్థలు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని గిట్టుబాటు ధర కల్పించి, మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం దువ్వూరులో ఆయన రైతులతో కలిసి మాట్లాడుతూ మండలంలో మొక్కజొన్న పంట నూర్పిడి మొదలైందని అయితే గిట్టుబాటు ధర లేక అందిన కాడికి అమ్ముకుంటున్నారని అన్నారు. ఇటీవల తుఫాన్ ల భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకునేందుకు వెంటనే మార్క్ ఫెడ్ ద్వారా గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పెద్ద పుల్లయ్య, రామ్మూర్తి, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

# కృత్రిమ కాళ్లతో యోగ పాఠాలు





భవిష్యత్తుపై ఎన్నో కలలు.. వాటిని సాకారం చేసుకోవాలనే ఆలోచనలతో ఆమె జీవితం అందంగా సాగిపోతోంది. అప్పుడే దురదృష్టవశాత్తూ ఓ ప్రమాదంలో తన రెండు కాళ్లనూ కోల్పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా అయితే, నిరాశలో కూరుకుపోతారు. జీవితం ఇక ముగిసి పోయిందనుకుంటారు. కానీ, హైదరాబాద్‌కి చెందిన అర్పితా రాయ్ మాత్రం కృత్రిమ కాళ్ల సాయంతో లేచి నిలబడటమే కాదు.. యోగాసనాలూ వేస్తోంది. శిక్షకురాలిగా మారి పదిమందికీ నేర్పిస్తోంది. ఆ స్ఫూర్తి ప్రయాణాన్ని తెలుసుకుందాం.

కాళ్ల తడవకుండా సముద్రాన్నీ, కన్నీళ్లు కార్చకుండా జీవితాన్నీ దాటలేం.. మరి కష్టమొచ్చిందని జీవన ప్రయాణాన్ని ఆపేస్తే ఎలా? అందుకే, రోడ్డు ప్రమాదంతో ఒక్కసారిగా నా బతుకే తలకిందులైన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. రెండు కాళ్లూ లేకపోయినా నా అంతట నేను లేచి నిలబడగలుగుతున్నా. యోగా టీచర్‌గా మారి మరెంతో మంది జీవితాల్లో స్ఫూర్తి నింపాలనే లక్ష్యంతో సాగుతున్నా. మా స్వస్థలం పశ్చిమ్ బెంగాల్ రాష్ట్రంలోని బ్యారక్‌పూర్. కోల్‌కతాకు 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది మా ఊరు. 2006 ఏప్రిల్ 21. ఆ రోజు సాయంత్రం ఇంటికి అవసరమైన సరకులు తేవాలని స్నేహితుడి బండి మీద బయలుదేరా. ఇక కాసేపట్లో గమ్యం చేరుకుంటాం అనుకుంటుండగా వేగంగా వచ్చిన ఓ బైక్ మమ్మల్ని గుద్దేసింది. ఆ వేగానికి రోడ్డు మీద పడిపోయాం. ఆ వెనకే వస్తోన్న లారీ నా రెండు కాళ్లమీదుగా వెళ్లడంతో నుజ్జయి పోయాయి. వెంటనే ఓ హాస్పిటల్‌కి తీసుకెళ్తే ప్రాథమిక చికిత్స చేసి, పెద్దాసుపత్రికి పంపించారు. అయితే, రెండు కాళ్లకూ ఆపరేషన్ చేయాలంటే లక్షల్లో డబ్బులు కావాలన్నారు. నాకంటే ఏడాది పెద్దయిన అన్నయ్యే మా కుటుంబానికి ఆధారం. చాలా కష్టపడితేనే కానీ డబ్బులు సర్దుబాటు కాలేదు. ఇందుకు పన్నెండు రోజుల సమయం పట్టింది. ఈలోగా గాంగ్రిన్ ఇన్ఫెక్షన్ ఎనభై శాతం ఒంటికి పాకేసింది. వాస్తవానికి ప్రమాదం జరిగిన వెంటనే శస్త్రచికిత్స చేస్తే ఒక కాలైనా ఉండేదేమో! కానీ రెండు కాళ్లూ మోకాలి కింది వరకూ తీసేయాల్సి వచ్చింది. మత్తు దిగాక విషయం తెలిసి గుండెలవిసేలా ఏడ్చా. కానీ, ఫలితం ఉండదని అర్థ మైంది. ఆపై నాలుగు నెలలకు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యా.

**ఎవరి మీదా ఆధారపడొద్దని...** అందరు ఆడపిల్లల్లానే నాకూ కొన్ని కలలు ఉండేవి. ఎయిర్ హోస్టెస్‌గానో, మోడల్‌గానో రాణించాలని అనుకునేదాన్ని. ఆ దిశగా దారులు వేసుకుంటోన్న సమయంలోనే ఈ యాక్సిడెంట్ అంతా తలకిందులైంది. కొందరు జాలి చూపించేవారు. ఇంకొందరేమో నేనెప్పటికీ కుటుంబానికి భారమే అంటూ నిట్టూర్పులు విడిచేవారు. ఇవన్నీ నా మనసుకి బాధ కలిగించేవి. అయినా, ఎన్నాళ్లిలా ఏడుస్తూ కూర్చుంటా.. అందుకే నెమ్మదిగా వాస్తవాన్ని అంగీకరించడం మొదలుపెట్టా. వైద్యులు నా శరీరాకృతి దెబ్బతినకుండా ఉండటానికి రోజూ ఓ గంట నిలబడమన్నారు. పంటిబిగువునన బాధను భరిస్తూ చాలా కష్టంగా అలవరుచుకున్నా. మామూలు మనిషిని కావడానికి చక్రాల కుర్చీలోనే వెళ్లి ఉద్యోగ ప్రయత్నాలు చేశా. చివరికి ఓ కాల్ సెంటర్‌లో చేరా. నాకు ఇతరులపై ఆధారపడటం ఇష్టం ఉండేది కాదు. దీనికోసం నా శరీరం ఫ్లెక్సిబుల్‌గా ఉండాలని భావించా. ఇందుకు యోగా ఉపయోగపడు తుందని చెప్పడంతో కృత్రిమ కాళ్లతో సాధన చేయడం ప్రారంభించా.

**ఫొటోల్లో కాళ్లు కనిపించకుండా..** అంతా నీవల్ల కాదన్నారు. కానీ, ప్రయత్నలోపం ఉండకూడదని గట్టిగాఅనుకున్నా. మొదట చిన్నగా ఆరంభించా. ఆపై కిష్టమై ఆసనాలూ వేయగలిగా. కొన్ని భంగిమ్మర వేయడం సాధారణ వ్యక్తులకైనా కష్టమే. అలాంటి వాటిపైనా నేను పట్టు సాధించగలగడం చూసి అంతా ఆశ్చర్యపోయేవారు. వాటిని ఇన్‌స్టాలో పోస్ట్ చేసేదాన్ని కొత్తల్లో నా కాళ్ల కనిపించకుండా స్కర్టులు, వదులు పానయంటు వేసుకుని ఉన్న ఫొటోలను మాత్రమే క్రాప్ చేసి అప్‌లోడ్ చేసేదాన్ని కానీ, తరవాత నన్ను నేను అంగీకరించగలిగితేనే ఇతరులూ ఇష్టపడతారని అర్థం చేసుకున్నా. అంతా అభినందించడంతో నాలో మరింత ఉత్సాహం వచ్చింది. నేనూ ఇతరులకూ బోధించ గలనన్న నమ్మకం వచ్చాక ఉపాధ్యాయ కోర్సులు చేశా. తరవాత యోగా టీచర్ ఉద్యోగం కోసం హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డా. అలా 2019 నుంచి ఔత్సాహికులకు యోగా పాఠాలు నేర్పించడం ఆరంభించా. ఒకరిద్దరితో మొదలైన ఈ తరగతుల్లో కొవిడ్ ముందు నాటికి ఇద్దరు దివ్యాంగులతో సహా పాతికమంది విద్యార్థులు ఉండేవారు. వారి విష యాన్ని మరికొంతమందితో చెప్పడంతో క్రమంగా ఆసంఖ్యపెరిగింది.



అయితే, నేనిప్పుడు వినియోగిస్తున్న కృత్రిమ కాళ్లు మాన్యువల్ రకాలు. మైక్రోప్రాసెసర్, అండ్ అడ్వాన్స్‌డ్ లింబ్స్ ఖరీదైనవి కావడంతో ఇప్పటివరకూ కొనుక్కోలేక పోయా. భవిష్యత్తులో వాటి సాయంతో మరిన్ని అద్భుత ప్రయోగాలు చేయగలుగుతానని నమ్ముతున్నా. మరో పక్క యోగా సైకాలజీ, గైడెడ్ మెడిటేషన్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులు పూర్తి చేశా. ఓ కార్పొరేట్ కంపెనీలో ఫుల్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నా. మరో పక్క సాధారణ వ్యక్తులతో పాటు ప్రత్యేక అవసరాలున్న చిన్నారులూ, దివ్యాంగులు, కృత్రిమ కాళ్లతో నడిచే వ్యక్తుల కోసం ప్రత్యేకంగా తరగతులు నిర్వహి స్తున్నా. సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్‌ఫోర్స్(సిఆర్‌పిఎఫ్) పోలీసులకూ వర్క్‌షాపులు నిర్వహించా. దేశవిదేశాల్లోని వారికీ ఆన్‌లైన్ కాలేజీ, యోగా సమావేశాల్లో మోటివేషన్ స్పీచ్‌లనూ ఇస్తున్నా.

# రాజకీయ పలుకుబడితో భూమి కాజేశారని ఫిర్యాదు

మా భూమి మాకు ఇప్పించండి... ఎస్సీ కమీషన్ కు ఫిర్యాదు

పీలేరు నవంబర్ 25 ప్రభాతవార్త :

నియోజకవర్గంలోని కలికిరి మండలం పత్తే గడ పంచాయతీ, కొర్లకుంట గ్రామం తెల్లగుట్ట మాలపల్లి హరిజనవాడలో కాపురం ఉంటున్న లేట్ కాకి సిద్దయ్య భార్య రత్నమ్మ తమ భూమి తమకిప్పించాలంటూ విజయవాడలో ఎస్సీ కమిషనర్కు ఫిర్యాదు చేసింది. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి తమకున్న సర్వేనెంబర్ 184/2C, A. లో 1.90 ఎకరాల భూమిని రాజకీయ పలుకుబడితో ఆన్లైన్లో పొందుపరచుకున్నారని, తహశీల్దార్ కార్యాలయానికి ఎన్నిసార్లు తిరిగిన నాకు న్యాయం జరగలేదని, మండల సర్వేర్ మాకు అన్యాయం చేశారని ఆమె ఎస్సీ కమిషన్ ఎదుట తన బాధను వెళ్ళగక్కారు. మా ఆధీనంలో ఉన్న భూమిని తమ పేరుపై ఆన్లైన్ చేసుకొని వశపరచుకున్నారని నేను అడగగా కులం పేరుతో నన్ను దూషించి నాపైన దాడి కూడా చేశారని ఆమె ఎస్సీ కమిషన్ కు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కలికిరి మండల సర్వేర్ను మాభూమి మాకు సర్వే చేసి ఇప్పించాలని కోరగా నీకు న్యాయం జరగాలంటే లంచం డిమాండ్ చేసినట్లు ఎస్సీ కమిషన్కు వివరించారు. నా భూమికి నేను ఎందుకు డబ్బులు కట్టాలి ప్రశ్నించగా నీకు దిక్కున చోట చెప్పుకోపో అంటూ కులం పేరుతో దూషించారని తెలిపారు. రత్నమ్మ గత ఐదు సంవత్సరముల నుండి అన్నమయ్య జిల్లా కలెక్టర్ సబ్ కలెక్టర్ దగ్గరికి వెళ్లి "స్పందన" కార్యక్రమంలో అర్జీలు సమర్పించుకున్నానని తనకు ఎక్కడ న్యాయం జరగలేదని వాపోయారు. కావున తమపై దయతలిచి జిల్లా సర్వేర్ చేత తమ భూమిని సర్వే చేయించి సరిహద్దులు చూపించి న్యాయం చేయాల్సిందిగావారు కోరారు.



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

## డిప్యూటేషన్పై వెళ్లిన వారిని రప్పించాలి

ఎడ్యుకేషన్ నవంబర్ 25 ప్రభాతవార్త :



యోగి వేమన యూనివర్సిటీ విద్యార్థుల అకడమిక్ హక్కులు, విద్యా నాణ్యత దెబ్బతింటున్న నేపథ్యంలో, డిప్యూటేషన్ పేరుతో ఇతర సంస్థలకు పంపిన ప్రొఫెసర్లను తిరిగి విధుల్లో చేర్చుకోవాలని AISA జిల్లా కమిటిగా డిమాండ్ చేస్తు యోగివేమన యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ రాజశేఖర్కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా AISA జిల్లా కన్వీనర్ బండి అనిల్ మాట్లాడుతూ రీసెర్చ్ కార్యకలాపాలు మందగించడం, విద్యార్థుల ప్రాజెక్టులు, గైడెన్స్కు నష్టం జరగడం, విభాగాల పరిపాలన లోపించడం, వంటి సమస్యలు నెలకొన్నాయని యూనివర్సిటీ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రసాద్, మనోహర్లు పాల్గొన్నారు.

## పెండింగ్లో వున్న ఫీజులు విడుదల చేయాలి

ఎడ్యుకేషన్ నవంబర్ 25 ప్రభాతవార్త :



రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ విద్యారంగ సంస్థల్లో చదువుతున్న విద్యార్థుల యొక్క సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డిమాండ్ చేశారు. అధ్యక్షులు మంజుల నరేంద్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు కావాస్తున్న ఇంతవరకు డిగ్రీ అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తికాలేదు. దీని కారణంగా విద్యార్థుల సమయం వృధా అవుతుందన్నారు. అలాగే పెండింగ్లో ఉన్న 6000కోట్ల ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదల చేయాలనీ డిమాండ్ చేసారు. విద్యారంగా సమస్యలు పట్ల నిరక్ష్యం చేస్తే ఆందోళన చేస్తామని తెలిపారు ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గోపి, కేశవ, హరి, రత్నపాల్, నరసింహ పాల్గొన్నారు.

## ద్వాక్రా మండల సమైక్య అధ్యక్షురాలు ఎంపిక

తొండూరు నవంబర్ 25 ప్రభాతవార్త :



మండలానికి సంబంధించిన ద్వాక్రా మహిళల మండల సమాఖ్య యొక్క మహాసభ జరగడం జరిగింది. ఈ సమావేశంలో 2024-25లో జరిగిన కార్యక్రమాలపై మరియు మండల సమాఖ్య పదాధికారులను ఎంపిక చేశారు. అధ్యక్షురాలుగా రవికుమారి, కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా వరలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మండలంలోని అన్ని గ్రామ సంఘాల ప్రతినిధులు ఏపిఎం వెంకటనారాయణ, ఎల్సి నాగార్జున, సీసీలు జిలాని భాష వీర మోహన్ ఆంజనేయులు అకౌంటెంట్ హరి పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం సర్వే పరిశీలన

పెనగలూరు నవంబర్ 25 ప్రభాతవార్త



మండలంలోని అనంతంపల్లి ముద్రపల్లి, ఇండ్లూరు గ్రామాల్లో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని కే. శివశంకర్ సహాయ వ్యవసాయ సంచాలకులు, రాజంపేట, ఉద్యాన అధికారి సునీల్కుమార్, మండల వ్యవసాయ అధికారి సుబ్రమణ్యం పాల్గొన్నారు. ఏడిఏ మాట్లాడుతూ రైతులు సిఎం చెప్పినట్టు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించుకోవాలన్నారు. ఉద్యాన అధికారి సునీల్ మాట్లాడుతూ ప్రతి రైతు సాగులో టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రతి రైతుకు ఆర్థిక సహాయాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుజనా, నరసింహ, మానస మరియు రైతులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్కు మందు లేదు నివారణకు ఒక్కటే మార్గం

సుండుపల్లె, నవంబర్ 25,ప్రభాతవార్త :



మండల పరిధిలోని రాయవరం పీహెచ్సి పరిధిలోని చైల్డ్ ఫండ్ ఇండియా వర్కర్ ఆధ్వర్యంలో ఎయిడ్స్పై అవగాహనా, పరీక్షలు డాక్టర్ రూబీనా ఆధ్వర్యంలో జరిగినది. రూబీనా మాట్లాడుతూ హెచ్ఐవి పట్ల యువతకు అవగాహనా కలిగి ఉండాలని, హెచ్ఐవికి గురి కాకుండా చూసుకోవాలన్నారు. చికిత్స కన్నా నివారణకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ నందు హెచ్ఐవి పరీక్షలు అందుబాటులో ఉన్నాయని.. నిర్ధారణ అయితే ఉచితంగా మందులు ఇచ్చి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఇఒ వీరన్నారాయణ సిహెచ్ఒ సాల్మహన్ ఎఎన్ఎం అనిత, వర్కర్ప్రసాద్, ఆశాలు నాగరాణి, అనురాధ పాల్గొన్నారు.

## రైతన్నా మీ కోసంలో జనసేన నేత

సుండుపల్లి, నవంబర్ 25,ప్రభాతవార్త :



ఎన్డీయే కూటమి ప్రభుత్వం ద్వారా రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా మిత్రబృందంతో కలిసి రైతులకు కరపత్రాల పంపిణీలో జనసేనపార్టీ సీనియర్ నేత రామా శ్రీనివాస్ మాట్లాడుతూ మారుతున్నా కాలానికి అనుగుణంగా రైతులు సాగు పద్ధతులు మార్చుకోవాలని, పంటల మార్పిడి పాటించాలన్నారు. చిరు ధాన్యాల సాగు మరింత పెరగాలి. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం ఆకస్మిక తనిఖీ

సిద్ధవటం నవంబర్ 25 ప్రభాతవార్త



రైతన్న మీకోసం కార్యక్రమాన్ని వ్యవసాయ సంయుక్త సంచాలకులు చంద్ర నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలోని కడపాయపల్లె గ్రామంలో మంగళవారం జరుగుతున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సంచాలకులు చంద్రనాయక్ ఆకస్మిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులతో ముఖాముఖి చర్చ నిర్వహించి కరపత్రాలు ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ రెడ్డి, విఏఏ, జైపాల్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

## సర్వేయర్ను సస్పెండ్ చేయాలి

పీలేరు నవంబర్ 25 ప్రభాతవార్త:



నియోజకవర్గంలోని కలికిరి మండల పరిధిలో మండల సర్వేయర్గా పనిచేస్తూ దళితులకు వ్యతిరేకంగా భూస్వాముల కొమ్ముకాస్తూ రెవెన్యూ రికార్డులను తారుమారు చేస్తూ పేదల కడుపు కొడుతున్న సర్వేయర్ను విధుల నుంచి తొలగించాలని రాష్ట్ర మాల మహానాడు కార్యదర్శి వద్దే హరి అన్నారు. మండల పరిధిలో ఉన్న దళితుల భూములను రికార్డుల్లో భూస్వాములకు మార్పులు చేస్తూ వారికి మడుగులెత్తుతున్న సర్వేయర్ను విధుల నుంచి తొలగించకపోతే ధర్నా చేయక తప్పదన్నారు. ఇప్పటికే ఆయనపై జిల్లా అధికారులకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషనర్కు ఫిర్యాదులు చేశామని వారి ఆదేశాలతో ఎప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మండలములో ఉన్న పేద రైతులకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు వారి భూములను వారికి తిరిగి సర్వే చేయించి వారికి న్యాయం చేయకపోతే రాబోయే కాలంలో ప్రజా ప్రతిఘటన తప్పటమే కాకుండా ధర్నాలు సైతం చేయడానికి వెనుకాడబోమని హరి అన్నారు.

## ఫైలేరియా వ్యాధిని అంతమొందించండి.

బద్వేలు అర్బన్, నవంబర్ 25, ప్రభాతవార్త



ప్రజలలో అవగాహన కల్పించి ఫైలేరియా వ్యాధిని పూర్తిగా లేకుండా చేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి టి నరసింహ రెడ్డి అన్నారు. బద్వేల్ మండలం పుటాయిపల్లి ఫైలేరియా వ్యాధిపై వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులతో తగు చర్యలు తీసుకోవాలని సూచనలు అందించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి మాట్లాడుతూ వ్యాధి ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేయవచ్చు అన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ బి వెంగయ్య మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే పాటించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల కు పోయి వేల రూపాయలు పోగొట్టుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్ధన్ రావు, సూపర్వైజర్ వెంకటమ్మ, సిహెచ్ఓ సుస్మిత, ల్యాబ్ టెక్నీషియన్ వి మహేంద్ర ఏఎన్ఎం సుబ్బలక్ష్మి, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని, రక్త పరీక్షలను చేయించుకున్నారు.

## సజావుగా దరఖాస్తుల స్వీకరణ

పెద్దమండెం నవంబర్ 25 ప్రభాతవార్త



మండలంలోని 17 పంచాయతీలలో మండల కమిటీ అనుబంధ కమిటీల ఎంపికకు మంగళవారం కల్చర్ల ఫంక్షన్ హాల్లో తంబళ్లపల్లి నియోజకవర్గం అబ్జర్వర్ దినేష్ రెడ్డి పూల నాగరాజు చిట్టిబాబుల ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండలంలో చేపట్టనున్న మండల అధ్యక్షులు కమిటీల అనుబంధ కమిటీల ఎంపికకు ఆసక్తికర అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరించారు. అందులో గ్రామ అధ్యక్షులుగా 6 మంది కార్యదర్శులుగా నలుగురు క్లస్టర్ ఇంచార్జిలుగా ముగ్గురు దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ అధ్యక్షుడు ప్రసాద్ మండల ఉపాధ్యక్షు శ్రీనివాసులు నారా చింటూ మైసూర్ శ్రీనివాసులు మాజీ ఉపాధ్యక్షులు హసీం సాహెబ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

## కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం

తంబళ్లపల్లె నవంబర్ 25 ప్రభాతవార్త ః



బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిన తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని తంబళ్లపల్లె పరిశీలకుడు పోలంరెడ్డి దినేష్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం మల్లయ్య కొండ కింద టిడిపి మండల కమిటీ ఎన్నిక ప్రక్రియ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి క్రమశిక్షణకు మారుపేరని గ్రూపు రాజకీయాలు తగవని కార్యకర్తల అభిప్రాయ సేకరణతో అధిష్టానం ఆదేశాల మేరకు మండల కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. కార్యవర్గం ఎవరైనా ప్రతి కుటుంబ సభ్యుడు పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఉండాలన్నారు. స్పెషల్ అబ్జర్వర్ ఆర్టీసీ జోన్ చైర్మన్ నాగరాజు మాట్లాడుతూ పార్టీలో అలకలు మాని ఐకమత్యంతో పని చేయాలన్నారు. మండల అబ్జర్వర్ టీజే వెంకటేష్ మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు మండల కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి,రాజంపేట తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ కొటాల శివకుమార్,రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసి ధర్నాయుడు,మండల ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు, తెలుగు యువత నియోజకవర్గం ఉపాధ్యక్షుడు నరసింహులు, క్లస్టర్ ఇన్చార్జీలు కాలా నారాయణ,బేరి శ్రీనివాసులు, సోమశేఖర్, పురుషోత్తం, మీసాల భాస్కర్ నాయుడు, వీరాంజనేయులు,మాజీ జెడ్పిటిసి రామచంద్ర, మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలకు సమాన హక్కులు కల్పించాలి

ముద్దనూరు, నవంబర్ 25 ప్రభాతవార్త:



మహిళలకు సమాన హక్కులు సమాన అవకాశాలు కల్పించాలని మంగళవారం పట్టణంలో జెండర్ క్యాంపెయిన్ అవగాహన ర్యాలీనీ వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడమే జెండర్ క్యాంపెయిన్ ముఖ్య ఉద్దేశం అని మహిళల హక్కుల పరిరక్షణ, లింగ వివక్ష నిర్మూలన, లింగ సమానత్వం, మహిళలకు సమాన హక్కులు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధాకృష్ణ వేణి, ఏపీఎం ఇబ్రహీం, వెలుగు సిబ్బంది ద్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## స్పెషల్ ఆఫీసర్ ఆదేశాలతో పారిశుద్ధం పనులు

తంబళ్లపల్లె నవంబర్ 25 ప్రభాతవార్త ః



తంబళ్లపల్లె క్రాస్ రోడ్ నుండి మోడల్ స్కూల్ వరకు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు వార్తలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన స్పెషల్ ఆఫీసర్ అమర్నాథ్రెడ్డి పారిశుద్ధం పనులు చేపట్టాలని ఆదేశించడంతో మంగళవారం పంచాయతీ కార్యదర్శిలు ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాసరావు, పద్మావతి, భాస్కర్లు పిచ్చి మొక్కలు తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ పనులు చేపట్టినందుకు ఎంఈఓ త్యాగరాజు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్, హై స్కూల్ కమిటీ చైర్మన్ శివకుమార్, ఆర్ఎంపీ డాక్టర్ మున్నా, వైకాపా నాయకుడు ఆధార్ మల్లి, హర్షం వ్యక్తం చేశారు.

## కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

లక్కిరెడ్డిపల్లి నవంబర్ 25 ప్రభాత వార్త

కష్టపడి చదివితే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ స్పెషలాఫీసర్ ఉషారాణి పేర్కొన్నారు మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి ఇంటర్మీడియట్ చదివే సమయంలోనే భవిష్యత్తుకు బాట వేయాలన్నారు చెడు అలవాటులకు మారకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆత్మవిశ్వాసంతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు ప్రతి విద్యార్థి బాగా చదివి మంచి ప్రయోజకుడు అయినప్పుడే తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఆ పాఠశాలకు పేరు వస్తుందన్నారు 2025 26 సంవత్సరంలో జరగబోవు పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి ఇంటర్మీడియట్ లో మంచి ఫలితాలు సాధించినప్పుడే పేరు వస్తుందన్నారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటసుబ్బయ్య ప్రిన్సిపాల్ వరాల రమేష్ వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.




సమావేశాల్లో మాట్లాడుతున్న ఉషారాణి

## రస్తా ఏర్పాటుతో ఎమ్మెల్యే వరదకు ధన్యవాదాలు

ప్రొద్దుటూరు నవంబర్ 25 ప్రభాతవార్త

తమ కాలనీకి స్మశాన రస్తా ఏర్పాటు చేసిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపినట్టు మండలంలోని కొత్తపల్లె పంచాయతీ నందు ప్రకాష్నగర్ వాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రకాష్నగర్లో సుమారు 40 సంవత్సరాల నుండి హిందూ స్మశాన వాటికకు వెళ్లేందుకు దారి లేక చాలా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సుమారు 2 నెలల క్రితం ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని కలిలి తెలపగా, స్వయంగా ఆయన, ఆయన తనయుడు టిడిపి కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి స్మశాన రస్తాను పరిశీలించి వెంటనే రెవెన్యూ, పంచాయతీ అధికారులను పిలిపించి రస్తా ఏర్పాటుకు కృషి చేశారని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి, టిడిపి కార్యదర్శి నంద్యాల కొండారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రకాష్ నగర్ వాస్తవ్యులైన ఖాసీం, శివ, తుపాకుల రసూల్, శంకర్, మురళి, వంశీ మరియు తదితర ప్రకాష్ నగర్ గ్రామ ప్రజలు వున్నారు.

## అయ్యప్ప స్వాములు గండి క్షేత్రానికి పాదయాత్ర

ముద్దనూరు, నవంబర్ 25, ప్రభాతవార్త:



స్థానిక పట్టణంలోని అయ్యప్ప స్వామి గుడి దగ్గర నుంచి మంగళవారం అయ్యప్ప స్వామి గుడిలో గురుస్వామి శ్రీనివాసులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి, కాలినడకన చక్రాయపేట మండలం గండి వీరాంజనేయ స్వామి దేవాలయంకు బయలుదేరి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మం జిల్లా సంఘం అధ్యక్షుడు గుర్రప్ప డిటి సుధీర్ యాదవ్ ఎస్పిఆర్ ట్రాన్స్పోర్ట్ పవన్ కుమార్రెడ్డి పురుషోత్తం లక్ష్మీనారాయణ, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## మహిళల పట్ల వివక్షత వద్దు

లక్కిరెడ్డిపల్లి నవంబర్ 25 ప్రభాతవార్త



మహిళల పట్ల వివక్షత వద్దని పురుషుతోబడి సమానంగా చూడాలని ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు మంగళవారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో జెండర్ క్యాంపియన్ లో భాగంగా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు ప్రభుత్వాలు మహిళలు ఎన్నో రకాల పథకాలు అమలు చేస్తుందన్నారు. ఇంటికి దీపం ఇల్లాలు అనే విధంగా ప్రతి మహిళ విద్యావంతురాలు అయితే ఆ ఇంట్లో ప్రతి ఒక్కరు విద్యావంతురాలు అవుతారన్నారు. మహిళా అభివృద్ధి కోసం ప్రభుత్వాలు స్వయం సహాయక సంఘాలు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి మహిళ అభివృద్ధి అయితే ఆ కుటుంబం అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రెడ్డన్న ఏఎస్ఐ మస్తాన్ ఏపీఎం నిరంజన్ అకౌంటు మహిళలు పాల్గొన్నారు.

## పూలుకుంటలో రైతన్న మీకోసం కార్యక్రమం

గాలివీడు, నవంబర్ 25(ప్రభాతవార్త):



మండలంలోని పూలికుంట గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ మాట్లాడుతూ రైతులు అవలంభించాల్సిన ఐదు కీలక సూత్రాలైన నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటల ఎంపిక, అగ్రిటెక్ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు పథకాలు గురించి రైతులకు వివరించారు. అనంతరం డీపీఎం మోహన్, సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీఏ నవంత్బాబు, మండల వ్యవసాయాధికారి గౌతమి, వ్యవసాయ శాఖ నుండి సాహెబ్పీర్, ఆర్ఎస్కె అసిస్టెంట్ వినోద్, పలువురు సీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

## మాతృత్వం ఒక వరం.. దత్తత అందుకు మరో మార్గం

కలికిరి, నవంబరు 25, ప్రభాతవార్త:

మాతృత్వం ఒక వరం. అందుకు దత్తత మరో మార్గం అని అన్నమయ్య దత్తత విభాగం మేనేజర్ సుప్రియ అన్నారు. మంగళవారం బాలికల సంరక్షణలో భాగంగా ఏపీఎం దేవసేన ఆధ్వర్యంలో అంతర్జాతీయ దత్తత మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దత్తత విభాగం మేనేజర్ సుప్రియ మాట్లాడుతూ మహిళలకు దత్తత ప్రక్రియ మరియు దత్తత కొరకు పిల్లలు లేని తల్లిదండ్రులకు కావాల్సిన పత్రములు మరియు అనాథ పిల్లలు వదిలేయబడిన పిల్లలు అప్పగించిన పిల్లల సంరక్షణ గురించి వివరించారు. అనంతరం కలికిరిలో అంతర్జాతీయ దత్తత మాసోత్సవంపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం దేవసేన, వెలుగు సీసీలు ఆంజనేయులు, వెంకటరమణ, ప్రభాకర్, బాబాసాహెబ్, సోషల్ వర్కర్ లావణ్య, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## రైతన్న మీ కోసం కార్యక్రమం తనిఖీ

కలికిరి, నవంబరు 25, ప్రభాతవార్త:

మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో కలికిరి మండల వ్యవసాయాధికారిణి హేమలత పర్యవేక్షణలో జరుగుతున్న రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి మరియు కలికిరి మండల స్పెషల్ ఆఫీసర్ సుబ్రమణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతన్న మీ కోసం కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా రైతులు పండిస్తున్న పంటలకు సంబంధించి వివరాలు సేకరించాలన్నారు. మండలంలో 7440 మంది రైతులుండగా సోమ, మంగళవారం కలిపి అధికారులు 2600 మంది రైతులతో కలిసి రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించినట్లు స్పెషల్ ఆఫీసర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, డిప్యూటీ ఎంపీడీవో మహ్మద్ రియాజుద్దీన్, కలికిరి మండల వ్యవసాయాధికారిణి హేమలత, పంచాయతీ కార్యదర్శి వి.గంగాదేవి, వీఆర్వో సురేష్కుమార్రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ గుణశేఖర్, డిజిటల్ అసిస్టెంట్ ఉమామహేష్, వెటర్నరీ అసిస్టెంట్ పవన్కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అశోక్కుమార్ పాల్గొన్నారు.



## ఆలయాభివృద్ధికి కృషి చేస్తా



వేంపల్లె:నవంబర్ 25:(ప్రభాత వార్త)

మండలంలోని నందిపల్లి గ్రామంలో వెలసిన నందీశ్వర ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. మంగళవారం నందిపల్లి గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఆలయాన్ని సందర్శించారు. అనంతరం సంబంధిత ఆలయ పనులను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు ఎంపీ వైఎస్ అవినాష్ని శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డితో కలిసి ఆలయానికి సంబంధించి పలు సలహాలు సూచనలు చేశారు. ఎల్లవేళలా తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సులోచనమ్మ, వేంపల్లె మండల కన్వీనర్ కె.చంద్రఓబుల్ రెడ్డి, వేముల పరిశీలకుడు రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా, టీడీపీలు రైతు దుష్మన్లు

వేంపల్లె :నవంబర్ 25:(ప్రభాత వార్త)



రాష్ట్రంలోని వైకాపా, టీడీపీలు రైతు దుష్మన్ పార్టీలని ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్.తులసిరెడ్డి ధ్వజమెత్తారు. రైతుల విషయంలో ఆ రెండు పార్టీలవి మాటలే తప్ప చేతలు లేవని, వైకాపా ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపిస్తే, చంద్రబాబు ప్రభుత్వం కైలాసం చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం కూటమి నిర్వహిస్తున్న రైతన్న మీ కోసం ప్రచార కార్యక్రమం తప్ప మరేమీ కాదన్నారు. గిట్టుబాటు ధర కల్పించమని రైతులు వేడుకుంటుంటే, పంచసూత్రాలు బోధిస్తామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు దిక్కుతోచని స్థితిలో లబోదిబో అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతు పండించిన పంట లను కొని ఆదుకోవాల్సిన అవసరం ఉందని, కానీ దురదృష్టవశాత్తు ఆ పని చేయడం లేదని విమర్శించారు. ఎరువుల ధరల నియంత్రణ, యూరియా కొరత నివారించడంలో పూర్తి వైఫల్యం, పంట నష్ట పరిహారం అరకొర, సున్నావడ్డీ, పావలావడ్డీ పథకాన్ని నీరుగార్చారన్నారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామన్నారు..ఇప్పటికీ అతిగతి లేదన్నారు. రైతుల విషయంలో మాటలు కట్టిపెట్టి వీరిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమర్నాథరెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్రెడ్డి, నాగరాజు, రమణ పాల్గొన్నారు.

## డిసెంబర్ 6న అయ్యప్ప స్వాములు గ్రామోత్సవం

కలసపాడు, నవంబర్ 25 ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని డిసెంబర్ 6వ తేదీ అయ్యప్ప స్వాముల గ్రామోత్సవం ఉంటుందని గురుస్వామి వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప స్వాములు అందరూ ఉదయం పూజలు చేస్తారని, అలాగే కేరళ వారిచే భజన కార్యక్రమం డబ్బులు ఉంటుందన్నారు. మండలంలోని ప్రతి ఒక్కరు గ్రామోత్సవానికి రావాలని మధ్యాహ్నం భోజన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.

## మాజీ సైనికులకు ఇళ్ల స్థలాల కోసం సహకరించాలి

కడప కార్పొరేషన్, నవంబర్ 25 ప్రభాతవార్త:



దేశ సరిహద్దుల భద్రతను పర్యవేక్షిస్తూ, దేశంలో శాంతి భద్రతలను కాపాడుతూ, భూభాగాన్ని రక్షిస్తూ.. క్రమశిక్షణ, ధైర్యం, త్యాగనిరతి వంటి లక్షణాలతో దేశ సేవలో నిమగ్నమై పనిచేసిన భారత మాజీ సైనికులు ఉమ్మడి కడప జిల్లాలోని మాజీ సైనికులు, వీరనారి మహిళలకు ఇళ్ల స్థలాల ఇప్పించేందుకు సహకరించాలని ది జై జవాన్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ కార్యదర్శి కె. వెంకటేశ్వరరావు, ప్రమోటర్, చైర్మన్ వి. గోవర్ధన్ రెడ్డిలు కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డిని కోరారు ఈ మేరకు ఎమ్మెల్యే మాధవరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కె.వి.రావు మాట్లాడుతూ జిల్లాలో 11 మంది మాజీ సైనికులతో తాము ది జై జవాన్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ కడప ను రిజిస్టర్ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 250 మంది సొసైటీ సభ్యులు ఉన్నారన్నారు. వీరందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ముద్దనూరు, నవంబర్ 25 ప్రభాతవార్త:

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎల్ ఎమ్ కాంపౌండ్లోని సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ ద్యానియేల్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఘనంగా క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు..రెవరెండ్ ద్యానియేల్ వినయ్ కుమార్ సెమీ క్రిస్మస్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో సంఘస్తులు, మహిళలు,యువత పాల్గొన్నారు.

## చెరువుముందరకురవపల్లెలో వీధిలైట్లు ఏర్పాటు

కలికిరి, నవంబరు 25, ప్రభాతవార్త:



మండలంలోని చెరువుముందరకురవపల్లెలో గ్రామంలో మంగళవారం స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, పంచాయతీ కార్యదర్శి గంగాదేవిల ఆధ్వర్యంలో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు వీధిలైట్లు మరమ్మతులకు గురికావడం జరిగింది. సమస్యను గ్రామస్థులు సర్పంచ్ దృష్టికి తేగా స్పందించిన ఆయన పంచాయతీ కార్యదర్శితో చర్చించి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే

**రామసముద్రం, నవంబర్ 25 ప్రభాతవార్త :**

మండలంలోని కేసిపల్లె పంచాయితీలో నూతనంగా పవర్‌స్టేషన్‌ను మంగళవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తొందన్నారు. రైతులు, వినియోగదారులకు నిరంతర మెరుగైన విద్యుత్ అందించాలన్న లక్ష్యంలో విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో లోఓల్టేజి సమస్యతో బాధపడకుండా పీడర్‌లోడ్,ట్రాన్స్‌ఫార్మర్ ఒత్తిడి వంటివి తగ్గించేందుకు ఈ విద్యుత్‌స్టేషన్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యుత్ సిబ్బంది విద్యుత్ సేవలు అందించడంలో ముందుండాలని తెలిపారు. గతంలో నేను ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో ఏర్పాటుచేసిన సబ్‌స్టేషన్ ఇంతరకు ఉన్నాయని వీటి మధ్యకాలంలో ఇద్దరు ఎమ్మెల్యేలు వచ్చి వెళ్ళారని వారెవరూ రైతులను పట్టించుకోలేకపోయారన్నారు. అప్పటి నా హాయాంలో వేసిన రోడ్లు ఉన్నాయని, ఇతర ఎమ్మెల్యేలు వేసిన రోడ్లు అగుపడడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి ఎంతమాత్రం జరిగిందో ప్రజలకే అర్థమవుతోందన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్ స్కూల్‌కు క్లాస్‌రూమ్‌లను మంజూరు చేయాలని కోరగా వెంటనే స్పందించి ఆరు రూమ్‌లను మంజూరు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సిఎం రిలీఫ్‌పండ్ కింద రూ.1.24కోట్లు చెక్కులు మంజూరు కాగా త్వరలో బాధితులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ గంగాధరం, డిఈఈ హరికుమార్, అధికారులు మహమ్మద్ అజారుద్దీన్, లతీప్, మస్తాన్, సాంబశివ, నాయకులు గుండ్లపల్లె శివారెడ్డి, క్రిష్ణంరాజు, రూపేష్‌రెడ్డి, లోకరాజు, సుధాకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, అనీల్‌కుమార్, అల్తాప్‌బాషా, శంకర్, క్రిష్ణప్ప శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పుట్‌బాల్ జట్టుకు శ్రీవేద విద్యార్థి

**మదనపల్లె, నవంబర్ 25 ప్రభాతవార్త :**

మదనపల్లెలోని గ్రీవన్‌వాలీ పాఠశాలలో అండర్-14 బాల బాలికల జిల్లాస్థాయి పుట్‌బాల్ పోటీలు ఈనెల 19 నుంచి 21వరకు జరిగిన ఈ పోటీల్లో శ్రీవేద పాఠశాలలో 9వ తరగతి చదివుతున్న నీరుగట్టి మోక్షరెడ్డి అనే విద్యార్థి ప్రతిభ కనపరచి జాతీయ స్థాయి జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మి నారాయణరెడ్డి తెలిపారు.



ఎంపికైన విద్యార్థి

డిసెంబర్ 18నుంచి జార్ఖండ్‌లోని ర్యాంచిలో జరిగే ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి జట్టుకి ఎంపికైన విద్యార్థినిని తల్లిదండ్రులు అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మినారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఉపేంద్రరెడ్డి, అడ్మినిస్టేటివ్ అధికారి కిషోర్, నాగరాజు, ఫిజికల్ డైరెక్టర్ మహేంద్రలు అభినందించారు.

# రైతుల పక్షపాతి సిఎం చంద్రబాబు



రైతులకు కరపత్రాలు అందజేస్తున్న రెడ్డయ్య యాదవ్

**లక్కిరెడ్డిపల్లి నవంబర్ 25 ప్రభాత వార్త**

రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఏపీ అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగొల్ల రెడ్డయ్య యాదవ్ మాజీ డిసిసి బ్యాంక్ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అప్ప కొండయ్యగారి పల్లి దీన్నేపాడు లక్కిరెడ్డిపల్లి గ్రామంలో పర్యటించి ఇంటింటికి సంక్షేమ పథకాల గురించి కరపత్రాలు అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత 46.86 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరిందని వారు గుర్తు చేశారు అంతే కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల కోసం ప్రత్యేక పథకాలు ఏర్పాటు చేసి అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు అన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి మీ సంగం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ దండు శ్రీనివాసులు టిడపి మైనార్టీ యువజన నాయకుడు షేక్ ఆరిఫ్, మార్ల మోహన్ రెడ్డి, ఘోర ,పటాన్ సాదుల్లా, ముక్తియర్ అహ్మద్ చీరల సుధాకర్ యాదవ్ నాగమణి నాయుడు భాస్కర్ రెడ్డి బదుగు వాసుదేవుడు నసీరుద్దీన్ ధర్మారెడ్డి రవి ఆచారి రామకృష్ణ , వెంకటేశు తదితరులు పాల్గొన్నారు

## జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా విద్యార్థులు



**కడప కార్పొరేషన్ నవంబర్ 25 ప్రభాతవార్త:**

డిసెంబర్ 13వ తేదీ నుండి 17 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కడప జిల్లా విద్యార్థినిలు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 24 తేదీ నుండి 25 వరకు పల్నాడు జిల్లా వినుకొండ లయోలా ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అండర్ 17 బాల, బాలికల 69వ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలలో విశేష ప్రతిభ కనబరిచి గంగనపల్లి ప్రభుత్వ పాఠశాల 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు వి. ముబీనా ప్రథమ స్థానము, వి.సాహిదా ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థినిలు విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వచ్చేనెల లక్నోలో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని విజయం సాధిస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. విజయం సాధించిన విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇక్ బాల్, వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్ రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

# నియోజకవర్గంలో ఎక్కడైనానీటి సమస్యకు తక్షణ పరిష్కారం

### టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు

**రాజంపేట, నవంబర్25 ప్రభాతవార్త**

నియోజకవర్గంలో ఎక్కడైనానీటి సమస్య ఉన్నట్లయితే తక్షణం పరిష్కరిస్తామని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు అన్నారు. రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని 21 వార్డులు విద్యుత్ నగర్ లో నీటి సమస్య ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన జగన్ మోహన్ రాజు బోరు వేసేలా ఏర్పాటు చేశారు. స్వయంగా వార్డుకు వెళ్లి బోరు వేసేటప్పుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ నీటి సమస్య ఉత్పన్నమైన తన దృష్టికి తీసుకురావాలని వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తక్షణం స్పందించినందుకు అక్కడే ఉన్న వార్డు ప్రజలు జగన్ మోహన్ రాజు కు కృతజ్ఞతలు తెలిపారు.నీటి వృథాపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని కూడా ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు,సీనియర్ నాయకులు గుగ్గిళ్ళ హరిప్రసాద్, గుగ్గిళ్ల చంద్రమోళి,క్లస్టర్



రాజంపేట విద్యుత్ నగర్ లో బోరు పరిశీలిస్తున్న జగన్ రాజు

ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య, కౌన్సిలర్ తుపాకుల అశోక్, గుణకల చిన్న, తోట నవీన్ కుమార్, సంగరాజు నరసింహారాజు, కోనేటి రమణ, కుంచపు వెంకటస్వామి, భాను నందు, హరిచరణ్, విద్యుత్‌నగర్ మహిళలు పాల్గొన్నారు.

## ఉచిత కోచింగ్‌తో స్కాలర్షిప్ పొందాలి



**ప్రొద్దుటూరు అర్బన్ , నవంబర్ 25, ప్రభాత వార్త**

జన విజ్ఞాన వేదిక అందించే ఎస్ఎంఎంఎస్ ఉచిత కోచింగ్ ను అర్హులైన ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని స్కాలర్షిప్ పొందాలని లెక్చరర్ లక్ష్మీ నారాయణ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులు ఎన్.ఎమ్.ఎమ్.ఎస్ స్కాలర్ షిప్ పరీక్ష రాసేవారి కోసం జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ రావు పంపిన ఎస్ఎంఎంఎస్ మెటీరియల్స్‌ని మంగళవారం విద్యార్థులకు స్థానిక నందిని క్లాత్ మార్కెట్ లోని జెవివి ఆఫీసునందు జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, ఆడిటర్ భాస్కర్, సిఏ సురేష్ కుమార్ రెడ్డి, లెక్చరర్ లక్ష్మీనారాయణ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిధులు సురేష్ కుమార్‌రెడ్డి, భాస్కర్‌లు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని, మాడల్ పేపర్లను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలని, ఇందులో ఉత్తీర్ణులైతే నాలుగు సంవత్సరాలు సంవత్సరానికి 12వేలు వస్తాయని అన్నారు. లెక్చరర్ లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ జెవివి ఉచితంగా ఇచ్చే కోచింగ్‌ను వినియోగించుకోవాలని, ఉన్నత లక్ష్యాలను జీవితంలో ఏర్పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెవివి పట్టణ ప్రధాన కార్యదర్శి నంగా రాజేష్, కోఆర్డినేటర్స్ బాల నరసింహులు, సుచరిత, శ్రావ్య, లావణ్య, ఫోటోగ్రాఫర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ ఇంటింట కార్యక్రమంలో మంత్రి

**సంబేపల్లి నవంబర్ 25 ప్రభాతవార్త**

మండలంలోని పీఎన్ కాలనీ గ్రామపంచాయతీ పరిధి నగరి గ్రామంలో మంగళవారం 'అన్నదాత సుఖీభవ' ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ఆంధ్రప్రదేశ్ అప్పుల పాలై అభివృద్ధి పూర్తిగా స్థంభించిపోయింది. కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పునఃప్రారంభమై పరుగులు పెడుతోంది" అని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాట మా ప్రభుత్వానికి పరమ వ్రతం. కూటమి ప్రభుత్వం చేసిన ప్రతి హామీని వరుసగా అమలు చేస్తోంది. రైతన్నల కోసం రూపొందించిన అన్నదాత సుఖీభవ పథకం ఆ దిశగా పెద్ద అడుగు" అని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు సంవత్సరానికి రూ. 20వేలు అందిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం ఇప్పటికే ఆగస్టు, నవంబర్ నెలల్లో రెండు విడతలుగా 14వేలు రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని ఆయన వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి చేరవేయాలన్న లక్ష్యంతో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్వయంగా రైతుల ఇళ్లకు వెళ్లి అన్నదాత సుఖీభవ పథకం వివరాలు తెలియజేశారు. రైతు సంక్షేమం



తమ పార్టీ మూల సిద్ధాంతం. తమ పార్టీ జెండాలో నాగలి గుర్తు ఉండటమే రైతుల పట్ల అంకితభావానికి ప్రతీక. రైతన్నల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని మంత్రి పేర్కొన్నారు. పథకం పొందని రైతులు సంబంధిత అధికారులను సంప్రదించి, అవసరమైన వివరాలను సమర్పిస్తే తప్పక పథకం ప్రయోజనం లభిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.రైతులు పాస్ బుక్కు, ఆధార్ కార్డు, ఆధార్-బ్యాంకు ఖాతా అనుసంధానం తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలన్నారు. గ్రామంలో ఉన్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## ఎర్రచందనం జోలికి వెళ్తే కఠిన చర్యలు

### కర్నూలు రేంజ్ సీసీఎఫ్ కృష్ణమూర్తి



**సిద్దవటం నవంబర్25 ప్రభాతవార్త**

అటవీ భూములు అన్యాక్రాంతం చేస్తే కఠిన చర్యలు తప్పవని అలాంటి వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కర్నూలు రేంజ్ సీసీఎఫ్ కృష్ణమూర్తి హెచ్చరించారు. మండలకేంద్రమైన సిద్దవటం పురావస్తు శాఖకోటలోకి మొదటి మండపం, రెండవ మండపం, దంకా నగర్, హజరత్ సయ్యద్ షా బిస్మిల్లా షా ఖాద్రి దర్గాను సందర్శించి ప్రార్ధనలు చేశారు. అలాగే సొరంగ మార్గం ద్వారా పెన్నానదిలోని అందాలను బయనాకులర్ తో తిలకించారు. అలాగే సిద్దవటం రేంజ్ లోని సాహెబ్ బావి బేస్ క్యాంపును మంగళవారం కర్నూలు రేంజ్ సీసీఎఫ్ కృష్ణమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లంకమల అభయారణ్యం పర్యటన నేపథ్యంలో పరిశీలించడం జరిగిందన్నారు. ఎర్రచందనం జోలికి వెళ్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమని ఈ మేరకు ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలు ఆదేశాలు జారీ చేశారన్నారు. సిద్దవటంలో ఎకో టూరిజంను అభివృద్ధి చేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పెన్నానది హై లెవల్ వంతెనపై లైటింగ్, పెన్నానదిలో పర్యాటక అందాలను తిలకించేందుకు, పర్యాటకులను ఆకర్షించేలా టెంట్లు ఏర్పాటు, కోటలో లైటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో సందర్శించి ఎకో టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు. లంకమల అభయారణ్యంలోని సిద్దవటం రేంజ్ లోని సాహెబ్ బావి బేస్ క్యాంపు, టైగర్ జోన్ లను మరింతగా అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. అటవీ అందాలు, పర్యావరణాన్ని పర్యాటకులు తిలకించేలా సౌకర్యాలు ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతితో కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప డిఎఫ్ఓ వినీత్ కుమార్, సిద్దవటం రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఫారెస్ట్ బీటు, అసిస్టెంట్ బీటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు



**కడప క్రైం, నవంబరు 25, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పాఠశాలల్లో పోలీసు అధికారులు, సిబ్బంది మంగళవారం మహిళా భద్రత(ఉమెన్ సేఫ్టీ)పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో విద్యార్థినిలకు బాలికల రక్షణ, సమాజంలో మహిళల భద్రత, మరియు పోక్సో (పీఓసీఎస్ఓ) చట్టం ప్రాముఖ్యత గురించి వివరించారు. బాలికలు ఎదుర్కొంటున్న మానసిక శారీరక వేధింపుల పట్ల జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు. సైబర్ క్రైం, సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్‌లైన్ భద్రత తదితర వాటిపై అవగాహన కల్పించారు. చిన్న వయసులో జరిగే బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై వారికి ఉదాహరణలతో వివరించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. డయల్ 100/112 (అత్యవసర సహాయం), చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ), గృహహింస 181, మహిళల వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్‌ఫ్రీ 1930, సైబర్ మిత్ర నంబర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఎర్రచందనం సహా ముగ్గురు నిందితులు అరెస్టు



**కె.వి పల్లి, నవంబర్ 25 ప్రభాతవార్త:**

కె.వి.పల్లి మండలంలోని నూతన కాలవ పంచాయతీ గుట్టలపైన ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతుందన్న విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ప్రత్యేక బృందంతో మంగళవారం సాయంత్రం దాడి నిర్వహించారు. అడవి మార్గాల్లో దాచిపెట్టిన ఎర్రచందనం దుంగలను వెలికి తీయడానికి ప్రయత్నిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. దాడిలో ఎర్రచందనం తరలించడానికి ఉపయోగించిన పరికరాలు, అలాగే భారీ బరువున్న ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.7.20 లక్షలుగా అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రం అమలు చేస్తున్న ఎర్రచందనం సంరక్షణ చట్టాలను ఉల్లంఘించినందుకు సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ ప్రాంతంలో ఇటీవల అక్రమ రవాణా కార్యకలాపాలు పెరగడంతో పర్యవేక్షణను మరింత బలపరిచినట్లు సిఐ లక్ష్మన్న తెలిపారు. అడవి మార్గాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని, ఇటువంటి చర్యలు పునరావతం కాకుండా కఠిన చర్యలు తీసుకునే విధంగా చూస్తున్నామని కె.వి.పల్లి సబ్ ఇన్స్పెక్టర్ వి. చిన్న రెడ్డప్ప తెలిపారు.

## శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలి



**మైదుకూరు, నవంబర్ 25, ప్రభాతవార్త:**

కడప ఏరువాక కేంద్రం ధ్వర్యంలో జిల్లా పరిధిలో అమలు చేస్తున్న వ్యవసాయ కార్యక్రమాల పరిశీలనలో భాగంగా ఆచార్య ఎన్.జి వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రధాన శాస్త్రవేత్త డా. టీ. గోపీకృష్ణ మైదుకూరు మండలం లోని అన్నలూరు గ్రామంలో కంది పంటలో ఎల్ ఆర్ జి 454 చిరుసంచుల ప్రదర్శన పొలాలను సందర్శించి రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని సూచించారు. ఈ సందర్భంలో పంట పెరుగుదల, మొక్కల ఆరోగ్యం, పువ్వు లదశ, గింజల ఏర్పాటుతో పాటు వ్యాధి మరియు పురుగు శత్రువుల ప్రభావాన్ని పరిశీలించారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అనుభవాలను సేకరించారు. నూతన రకమైన (LRG 454) పంటలో మొక్కల సమానమైన పెరుగుదల, ఎక్కువ పళ్ల సంఖ్య, గింజల నింపుదల మంచి స్థాయిలో ఉండటం సానుకూల సంకేతమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అదే విధంగా, (SMGR) వ్యవసాయ కళాశాల, ఉదయగిరి నుండి (RAWEP) కార్యక్రమం కింద శిక్షణ పొందుతున్న విద్యార్థుల కార్యక్రమాలను కూడా డా. గోపీకృష్ణ సమీక్షించారు. విద్యార్థులు రైతులకు అందిస్తున్న విస్తరణ సేవలు, పంట పరిరక్షణ సలహాలు, సాంకేతిక మార్గదర్శకాలు, రికార్డు నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయాల్సిన అవసరాన్ని, నీటి సంరక్షణ, సమయానికి పురుగు/వ్యాధి నిర్వహణ, విత్తన శుద్ధీకరణ మరియు పంట పోషకాలు సమతుల్యంగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం డాక్టర్ అండ్ కృష్ణప్రియ కోఆర్డినేటర్, రైతులు మరియు (RAWEP) విద్యార్థులు పాల్గొన్నారు.

### మదనపల్లి జిల్లా, పీలేరు రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించడంతో

## అంబరాన్ని అంట్టిన కూటమి శ్రేణుల సంబరాలు

### ఫలించిన ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి కృషి

**పీలేరు నవంబర్ 25 ప్రభాతవార్త:**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మదనపల్లి జిల్లా తోపాటు పీలేరు రెవెన్యూ డివిజన్ చేస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చినందుకు కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. పీలేరు పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో బాణ సంచాలు పేల్చి చంద్రబాబు గారి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల్లో మదనపల్లి, పీలేరు, పుంగనూరు తంబళ్లపల్లి నియోజకవర్గ ప్రజలకు అనుకూలంగా ఇచ్చిన హామీలు నెరవేర్చారని అన్నారు. మదనపల్లి జిల్లా, పీలేరు రెవెన్యూ డివిజన్ కోసం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మదనపల్లి, తంబళ్లపల్లి, పుంగునూరు, పీలేరు నియోజకవర్గాల్లో ఎన్నో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు పలు సార్లు విన్నవించడంతోపాటు అసెంబ్లీలో సైతం తన బాణిని వినిపించారని, అహర్నిశలు ఆయన చేసిన కృషి ఫలించిందని,పీలేరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలే పరమాదిగా పని చేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికు కూటమి శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



హస్తం వ్యక్తం చేస్తున్న తెదేపా నాయకులు

## అమ్మవారి విగ్రహ పున: ప్రాణ ప్రతిష్ట

**రామసముద్రం,నవంబర్25 ప్రభాతవార్త**

శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో మంగళవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా అమ్మవారి విగ్రహ పున:ప్రాణప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా అర్చకులు హోమాలు నిర్వహించి,వేదమంత్రాల నడుమ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

### బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి

**పులివెందుల నవంబర్ 25 ప్రభాత వార్త :**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్ రెడ్డి అనారోగ్య కారణంగా ఆయన పరామర్శించేందుకు జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి పులివెందులకు చేరుకున్నారు. ఆయన పరామర్శ తర్వాత కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ పులివెందుల నియోజకవర్గంలో బలోపేతం చేసే దిశగా అన్ని పోలింగ్ బూత్ కమిటీలను త్వరలో పూర్తి చేయాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డి గత 30 సంవత్సరాలుగా మచ్చలేని వ్యక్తిగా సమాజం కోసం ,పార్టీ కోసం జాతీయ భావాలతో కష్టపడుతున్న వ్యక్తి అని తెలిపారు. అలాంటి ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తిని విమర్శించే స్థాయి వైసీపీలోని చోటా నాయకులకు ఎవరికి లేదని తెలిపారు. మీ తాటాకు చప్పుళ్లకు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు భయపడరని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ తేరా మహేశ్వర్ రెడ్డి, పులివెందుల మండల అధ్యక్షుడు నవీన్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భాను ప్రకాష్, లక్ష్మయ్య, తిరుపాల్రెడ్డి, వాజ్పాయ్, విష్ణు యాదవ్, రాజశేఖర్, ఉపేంద్ర, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు

## శాశ్వత పరిష్కారం చూపండి

**సుండుపల్లె,నవంబర్ 25,ప్రభాతవార్త :**

సొంత నిధులతో గ్రామస్తులు రోడ్డుకు మరమ్మతులు చేయించారు. వివరాల్లోకి వెళితే.. సుండుపల్లె టౌన్ లోని అగ్రహారం నుండి బలిజ పల్లెకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండి వాహనదారులకు,పాదాచారులకు ఇబ్బందికరంగా ఉన్నది. ప్రతిరోజు ఐదు గ్రామాల ప్రజలు మరియు విద్యార్థుల స్కూల్ బస్సులు మరియు ఆటోలు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. పలు మార్లు అధికారులకు విన్నవించుకొన్నా, వార్తాపత్రికలలో వార్తలు ప్రచురించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ఎటువంటి ఫలితం లేదని గ్రామ ప్రజలు వాపోయారు. సమస్యను కూటమి నాయకుల దృష్టికి తీసుకువెళ్లిన ఎటువంటి ఫలితం లేకపోవడంతో మంగళవారం గ్రామస్తులు తమ సొంత నిధులతో రోడ్డుకు తాత్కాలిగా మరమ్మతులు చేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుకుంటున్నారు.



## డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేయాలి

**దువ్వూరు, నవంబర్ 25, ప్రభాతవార్త:**

రైతులు వ్యవసాయ రంగంలో డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్ద జొన్నవరం, యర్రబల్లె గ్రామాల్లో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో లాభసాటి పంటలు సాగు చేయాలని, మోస పద్ధతిలో పండించే పంటలు కాకుండా అధిక ఆదాయం వచ్చే పంటలు, ఉద్యానవన పంటలు, మార్కెటింగ్ ఆధారిత పంటలు సాగు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతన్న మీకోసంను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, 5 విధానాలతో రైతుల వద్దకు వెళుతున్నట్లు తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు తదితర వాటిపై రైతులకు వివరిస్తున్నామన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం కింద ప్రతి రైతుకు 20వేలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే డ్రిప్ ఇరిగేషన్, సబ్సిడీపై విత్తనాలు అందజేస్తున్నామని తెలిపారు. సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా ప్రతి రైతుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ అధికారి మనోజ్, రైతులు పాల్గొన్నారు.

